ప్రేమ్ కుమార్ ,రాష్ట్ర నాయకులు షేక్ మహమూద్, కె. కళ్యాణ్, భగతసింగ్, మహేష్, మధుకర్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చైతన్య యాదవ్, ఎండీ అన్వర్, అనిల్, హరీష్, జోసెఫ్ భాను, అరుణ్, ఆకాష్, కృష్ణ, వెంకటేష్, రఘు, రామ్ చరణ్, చిరంజీవి, ప్రభాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆగబోదన్నారు. ప్రధాని మోదీ, సిఈసి జ్ఞానేశ్ కుమార్ కలిసి ఓట్ల దొంగతనానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఓటింగ్ వ్యవస్థలో గందరగోళానికి కారణమైన సిఈసిని అభిశంసించాలని డిమాండ్ చేశారు. మరి శ్రీమాన్ మాట్లాడుతూ ఎన్నికల పారదర్శకత, స్వతంత్రతను దెబ్బతీసే చర్యలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థి, యువజన ఉద్యమాలను బలోపేతం చేస్తామని తెలిపారు. నిరుద్యోగం, రైతులు, కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్నారని విమర్శించారు. నేర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ ఎస్ఐఆర్‌ను రద్దు చేసి, సిఈసిని అభిశంసించే వరకు పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శివ కుమార్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు వంశీ వర్ధన్ రెడ్డి, లెనిన్, ముదిగొండ మురళి కృష్ణ, నెల్లి సత్య, బలుముల

నేరంగా మారిందా?

(4వ పేజీ తరువాయి)

మారింది. కానీ, అది ఇక ప్రాథమిక హక్కు కాదు' అని కపిల్ సిబల్ ఒక ఆన్‌లైన్ విలేకరుల సమావేశంలో మండిపడ్డారు.జంతర్ మంతర్‌ను నిరసన స్థలం జాబితా నుంచి తొలగించాలన్న నిర్ణయాన్ని ఆయన గట్టిగా ప్రశ్నించారు. ప్రజలు ఇప్పుడు రామ్‌లీలా మైదాన్‌లో నిరసనలు చేపట్టవచ్చని, అయితే అక్కడ జరుగుతున్న దసరా ఉత్సవాల కారణంగా ప్రదర్శనలు నిర్వహించడం అసాధ్యమని స్పష్టంచేశారు. 'నాకు నిరసన తెలిపే స్థలం ఉండగా నేను రామ్‌లీలా మైదాన్‌కు ఎందుకు వెళ్ళాలి? మీరు దానిని ఎందుకు రద్దు చేశారు' అని కపిల్ సిబల్ ప్రశ్నించారు. ఎటువంటి వివరణ లేకుండా రాళ్లతో కూడిన ట్రక్కును బయటి వ్యక్తుల చర్యలలోనై అక్కడకు తీసుకువచ్చారని, అందువల్లే అంతకుముందు జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో హింస చెలరేగిందని కపిల్ సిబల్ ఆరోపించారు. గుర్తు తెలియని వ్యక్తులు, సాధారణ దుస్తుల్లో ఉన్న వ్యక్తులు హింసకు పాల్పడ్డారని, నిరసనకారులను ఈడ్చేసి లాఠీ ఛార్జి చేశారని, మహిళలపై దాడి చేశారని కూడా సిబల్ తెలిపారు. నిరసనల సమయంలో మెట్రో సర్వీసులను నిలిపివేయడం, ఢిల్లీలోకి రైళ్లు ప్రవేశించకుండా ఆంక్షలను విధించడం వంటి రవాణా సేవలపై పరిమితులు విధించారని కపిల్ సిబల్ ఆరోపించారు. ఇతర దేశాల ఉదాహరణలను ఎంపి కపిల్ సిబల్ ఈ సందర్భంగా ఉటంకించారు. న్యూయార్క్, లండన్, పారిస్ వంటి నగరాలను తమ కేంద్రాలలో ముఖ్యమైన ప్రభుత్వ సంస్థల సమీపంలో ప్రజలు నిరసన ప్రదర్శనలు చేసేందుకు నిర్దేశిత స్థలాలను కేటాయించాయని ఆయన వివరించారు. 'న్యూయార్క్ నగరంలో, మీరు యూనియన్ స్క్వేర్ లేదా గ్రీన్‌విచ్ విలేజ్‌లో నిరసన తెలియజేయవచ్చు. ఇది నగరం మధ్యలో ఉంటుంది. ఒకవేళ మీరు లండన్‌లో పార్లమెంట్‌కు వ్యతిరేకంగా నిరసన తెలియజేయాలనుకుంటే, పార్లమెంట్ పక్కనే ఉన్న పార్లమెంట్ స్క్వేర్ , హైడ్ పార్క్‌లోని స్పీకర్ కార్నర్, ట్రాఫల్గర్ స్క్వేర్, లేదా వైట్ హాల్‌లోని డౌనింగ్ స్ట్రీట్ బయట వంటి ప్రదేశాలు ఉన్నాయి. ఫ్రాన్స్‌లో, పారిస్ నగర కేంద్రంలోని అనేక ప్రదేశాలలో, బాస్టిల్, కాంకోర్డ్, ట్రోకాడెరో ఉన్నాయి. ఇవన్నీ పారిస్ నగర కేంద్రంలోనే ఉన్నాయి' అని కపిల్ సిబల్ చెప్పారు. భారతదేశం ఎందుకు మినహాయింపుగా ఉండాలని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం విదేశాలలో ప్రజాస్వామ్య విలువలను ప్రోత్సహిస్తూ, స్వదేశంలో, భావ ప్రకటన స్వేచ్ఛను అణిచివేస్తోందని కపిల్ సిబల్ ఆరోపించారు. 'మనం విశ్వ గురువులం అని, మన ప్రజాస్వామ్య సాంప్రదాయాలు ప్రపంచానికి మార్గదర్శకమని మీరు చెబుతారు. దేశం వెలుపల మీరు వైవిధ్యం, వాక్ స్వాతంత్ర్యం గురించి మాట్లాడతారు. కానీ దేశంలోపలు వాటిని అణిచివేస్తారు' అని ఆయన మోదీ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. 'ఈ ప్రెషర్ కుక్కర్ ఏదో ఒక రోజు పేలిపోతుంది. దానికి పూర్తిగా మీరే కారణం అవుతారు' అని కపిల్ సిబల్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

హోర్మూజ్‌లో మరో సూపర్ ట్యాంకర్ ధ్వంసం



టెహ్రాన్ : హోర్మూజ్ జల సంధిలో తమ కళ్ళుగప్పి అడ్డదారిలో వెళుతున్న మరో సూపర్ ట్యాంకర్ సముద్ర మందుపాతరను ఢీకొని ధ్వంసమైందని,మంటల్లో దగ్ధమైపోయిందని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ శనివారం ప్రకటించింది. 20లక్షల బ్యారెళ్ళకుపైగా చమురు లోడుతో ఈ సూపర్ ట్యాంకర్ ప్రయోణం చేస్తోందని, ఐఆర్‌జిసి దళాలతో అనుసంధానం పెట్టుకోకుండా,వారి సహాయం, సలహాలు పాటించకుండా అడ్డదారిలో ఈ సూపర్ ట్యాంకర్ జలసంధి దాటి వెళ్ళిపోవాలని ప్రయత్నం చేసిందని,చివరకు మందుపాతరను ఢీకొని మంటల్లో దగ్ధమైపోయిందని ఐఆర్‌జిసి ప్రకటించింది. తమ నిబంధనలను ఉల్లంఘించి నౌకలు వెళ్ళకూడదని మరోసారి వాణిజ్య నౌకలకు హెచ్చరించింది. అమెరికా నౌకాదళం మాటలు విని అడ్డదారిలో ప్రయాణం చేసే తీవ్ర నష్టం కలుగుతుందని,తగిన మూల్యం చెల్లించుకోవాల్సివస్తుందని పేర్కొంది. జలసంధి పూర్తిగా ఐఆర్‌జిసి దళాల అధీనంలో ఉందని,తమను కాదని ఎవ్వరూ ఎలాంటి కార్యకలాపాలు చేయలేరని స్పష్టం చేసింది.

ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి

(4వ పేజీ తరువాయి)

నగరాన్ని భారతీయ సినిమా రంగంలో కీలక కేంద్రంగా నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. యువ దర్శకుల్లోని ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్ ఛాలెంజ్ నిర్వహించడం అభినందనీయమని ఉప ముఖ్యమంత్రి అన్నారు. మూడు గంటల సినిమాలో చెప్పగలిగే కథను కేవలం రెండు, మూడు నిమిషాల నిడివి ఉన్న షార్ట్‌ఫిల్మ్‌లో చెప్పడం ఎంతో సృజనాత్మకతతో కూడుకున్న విషయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎవరు గొప్ప దర్శకులుగా ఎదుగుతారో ఇప్పుడే చెప్పలేమని, అందరూ తమ సృజనాత్మకతను కొనసాగిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

యువ దర్శకులను ప్రోత్సహించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో షార్ట్‌ఫిల్మ్‌లు, పాటలు, జానపద గీతాలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, వ్యాసాలు తదితర విభాగాల్లో మొత్తం 29 అవార్డులతో యువ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. యువత రూపొందించిన షార్ట్‌ఫిల్మ్‌లను వీక్షించి, ప్రతిభావంతులను మరింతగా ప్రోత్సహించే అవకాశాలను పరిశీలిస్తానని తెలిపారు.

వాతావరణ మార్పులపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

సినిమా వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడే సందేశాలను అందించే సాధనంగా మారాలని భట్టి విక్రమార్క అన్నారు. ముఖ్యంగా రాబోయే రోజుల్లో వాతావరణ మార్పులు, సూపర్ ఎల్‌నినో ప్రభావాలు, ఉష్ణోగ్రతల పెరుగుదల, వర్షపాతంలో మార్పులు ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులపై ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయడంలో యువ దర్శకులు తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. ప్రజలకు సులభంగా అర్థమయ్యే కథలతో, ఆకట్టుకునే దృశ్యాలతో షార్ట్‌ఫిల్మ్‌లు రూపొందించి ప్రకృతి పరిరక్షణ, నీటి పొదుపు, పర్యావరణ సమతుల్యతపై చైతన్యం కల్పించవచ్చన్నారు. ఒక చిన్న గ్రామంలో జరిగే సంఘటన ఆధారంగా రూపొందించిన లఘు చిత్రం కూడా నేటి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపగలదని చెప్పారు. యువ దర్శకుల చేతుల్లో సమాజాన్ని ఆలోచింపజేసే శక్తి ఉందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భవిష్యత్తులో నీటి లభ్యత కీలక సమస్యగా మారే ప్రమాదం ఉందని ఉప ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఆహార ధాన్యాల లభ్యతతో పోలిస్తే తాగునీటి నిల్వలు, వాటి సంరక్షణపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వర్షపాతం పరిస్థితులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, నీటి ఆవిరి పెరుగుదల వంటి అంశాలు భవిష్యత్తులో నీటి వనరులపై ఒత్తిడిని పెంచవచ్చని పేర్కొన్నారు. మనుషులు, పశువులు, పక్షుల తాగునీటి అవసరాలను తీర్చేందుకు అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా ఎలా కాపాడుకోవాలి, వర్షపు నీటిని ఎలా ఒడిసిపట్టాలి, ప్రకృతిని ఎలా పరిరక్షించాలి వంటి అంశాలను కథాంశాలుగా తీసుకొని షార్ట్‌ఫిల్మ్‌లు రూపొందించాలని యువ దర్శకులకు విజ్ఞప్తి చేశారు. ప్రజల్లో బాధ్యతాయుతమైన ఆలోచనలను పెంపొందించడంలో కళాకారులు, కథానాయకులు, ఫిలిం మేకర్లు కీలక పాత్ర పోషించగలరని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, వాతావరణ మార్పుల ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించే కథాంశాలను కూడా యువ దర్శకులు ఎంచుకోవాలని సూచించారు. ప్రజల దైనందిన జీవితానికి ఉపయోగపడే సందేశాలను సృజనాత్మకంగా అందిస్తే షార్ట్‌ఫిల్మ్‌లు సామాజిక మార్పునకు దోహదపడతాయని పేర్కొన్నారు.

కళలు, సృజనాత్మకతకు ప్రభుత్వ ప్రోత్సాహం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కళలు, సృజనాత్మకత పట్ల ఆసక్తి ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి స్వయంగా ఫైన్ ఆరట్స్ కళాశాలలో చదువుకున్న నేపథ్యంలో కళారంగంలోని ప్రతిభను ప్రోత్సహించే ప్రయత్నాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. యువతలోని ప్రతిభను గుర్తించి, వారికి అవకాశాలు కల్పించడం ద్వారా తెలంగాణ నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే దర్శకులు, కళాకారులు ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వం ఆకాంక్షిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ డీ సి చైర్మన్ దిల్ రాజు, జూబిలీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఐ అండ్ పీఆర్ కమిషనర్ ముకుంద్ రెడ్డి , సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్, గాయని విమలక్క, జ్యూరీ చైర్మన్ ,సినీ దర్శకుడు హరీష్ శంకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉపముఖ్యమంత్రి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

షరతులతో బెయిలు

(4వ పేజీ తరువాయి)

నిర్వహించడంకోసం పోలీస్ స్టేషన్ చుట్టూ, ఆ వెలుపల భద్రతను కట్టుదిట్టం చేశారు. శుక్రవారం నాడు కన్నాట్ ప్లేస్‌లో లెహ్రా దో తిరంగా మార్చ్‌కు వెళ్ళేముందుగా, ఇంట్లోంచి బయటకు రాగానే దీప్కేకు పోలీసులు రెండు నోటీసులు జారీ చేశారు. ముందస్తు జాగ్రత్తగా ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఇరవైమందికిపైగా పోలీసులు ఝూండేవాలన్‌లోని ఆయన నివాసం వద్ద శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు ముందుగానే మోహరించి అదుపులోకి తీసుకున్నారు.ప్రదర్శనలో, ఊరేగింపులో, లేదా ర్యాలీలో పాల్గొనకూడదని హెచ్చరిస్తూ మొదటి నోటీసు ఆయనకు జారీ చేశారు. రెండో నోటీసును ప్రత్యేక కార్యనిర్వాహక మెజిస్ట్రేటు జారీ చేశారు. దీప్కేపై విధించిన శాంతి ఒప్పంద నిబంధనలు ఆయనకు తెలియజేస్తూ రెండో నోటీసు ఇచ్చారు. దీప్కేతోపాటు సిజెపి నాయకులు సౌరవ్‌దాస్, అశుతోశ్ రంకాకు కూడా ఈ నోటీసు జారీ చేశారు. ముందు జాగ్రత్తగా ఈ ముగ్గురునీ అదుపులోకి తీసుకున్న తర్వాత కోర్టు ఎదుట హాజరుపరిచారు. శాంతిని కాపాడాలని, ఏడాదిపాటు సత్ప్రవర్తనతో వ్యవహరించాలని ఈ రెండవ నోటీసులో వారికి తెలియజేశారు. అక్టోబరు పదో తేదీన దీప్కే, సౌరవ్‌దాస్, రంకాలను ముందస్తు అదుపులోకి తీసుకున్నారు. రూ.50,000లు వంతున ముగ్గురూ పూచీకత్తు చెల్లించిన తరాత్వాత బాండుపై సంతకాలు చేయించుకుని విడుదల చేశారు. శుక్రవారంనాడు మొత్తం 150 మంది కంటే ఎక్కువమందిని పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు. నిషేధ ఆజ్ఞలు ఉల్లంఘించారని ఆరోపిస్తూ వారిపై అనేక ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

సర్ నిలివేసి,జ్ఞానేశ్ రాజీనామా చేయాలి : నేహాబోరా డిమాండ్

ఇదిలా ఉండగా అఖిలభారత విద్యార్థి సంఘం(ఎఐఎస్ఎ) అధ్యక్షురాలు నేహాబోరాను శనివారం ఉదయం పోలీసులు విడుదల చేశారు. ఆ సమయంలోనే అభిజిత్ దీప్కేను ప్రత్యేక కార్యనిర్వహణా మెజిస్ట్రేటు ఎదుట హాజరుపరిచారు.వారిద్దరినీ ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల అదుపులోంచి విడుదలైన తర్వాత నేహాబోరా ఢిల్లీ పోలీసులపై పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించారు.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అక్రమంగా తమను నిర్బంధిస్తోందన్నారు.ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ ప్రక్రియను తక్షణం నిలిపివేయాలని ఆమె డిమాండ్ చేశారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరారు.పోలీసులు తనను మండీహౌస్ వద్ద నిర్బంధించారని,రాత్రంతా నిర్బంధంలోనే ఉంచారని,ఉదయం ఐదు గంటలవరకూ నిర్బంధంలోనే ఉన్నానని అన్నారు.ఎందుకు మమ్మల్ని ఈ విధంగా అక్రమంగా నిర్బంధిస్తున్నారు? అని ఆమె ప్రశ్నించారు.చాలా కాలంగా ఈ దేశంలో ఇలాంటి నిర్బంధాలు జరుగుతున్నాయని ఈ ఉద్యమం ద్వారా ఈనాడు చాలా స్పష్టంగా తెలిసిందని,ఈ విషయం వెలుగులోకి వచ్చిందని అన్నారు.ఓటర్ల తొలగింపులు కొనసాగినంత కాలం ఈ విధంగా ఉద్యమం జరుగుతూనే ఉంటుందని ఉద్ఘాటించారు.అభిజిత్ దీప్కేసహా అదుపులోకి తీసుకున్న ప్రదర్శకులందరినీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బిజెపి నుండి జ్ఞానేశ్ కుమార్ వరకూ అందరూ తమ అహంకారాన్ని విడనాడాలని డిమాండ్ చేశారు.జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి, ఆయనపై విచారణ జరపాలి,ఆయనను జైలుకు పంపాలి,అప్పుడే ప్రజలు ఊపిరి పీల్చుకుంటారు అన్నారు. నేహాబోరాను పోలీసులు అదుపులోకి తీసుకున్న తర్వాత ఐదు గంటలపాటు అటూ ఇటూ అనేక ప్రాంతాలలో తిప్పారని, ఆ తర్వాత ఆర్.కె.పురం పోలీస్ స్టేషన్‌కు తీకువెళ్ళారని ఐసా వర్గాలు ఆరోపించాయి.ఆమె తరపు న్యాయవాదులు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళినప్పటికీ ఆమెను వారిని కలవనివ్వలేదు.కొద్దిరోజులుగా ఆమె ఆరోగ్యం బాగాలేనప్పటికీ మందులుకూడా తీసుకోనివ్వలేదని ఐసా ఆరోపించింది.

న్యాయ చిక్కుల్లో ధ్రువ్ రాఠీ

ప్రముఖ యూట్యూబ్ ధ్రువ్ రాఠీ న్యాయపరమైన చిక్కుల్లో పడ్డారు. 2018 నాటి పరువు నష్టం కేసులో ఆయనకు ఢిల్లీ కోర్టు బెయిలబుల్ వారంట్లు జారీ చేసింది. గత ఏడేళ్లుగా విదేశాల్లో ఉంటున్న ఆయన తాజాగా నిరసనల్లో పాల్గొనేందుకు ఢిల్లీకి రావడాన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ఈ మేరకు చర్యలు చేపట్టింది. ధ్రువ్ రాఠీ తన యూట్యూబ్ ఛానల్‌లో పెట్టిన వీడియోపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ బీజేపీ ఐటీ సెల్ సభ్యుడు వికాస్ పాండే 2018లో పెట్టిన పరువు నష్టం కేసులో జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ రాహుల్ జైన్ వారెంట్లు జారీ చేశారు. కాగా, 2019 జులైలోనే ధ్రువ్‌కు సమన్లు ఇచ్చినట్లు కోర్టు పేర్కొంది.

ఉల్లంఘన పేరుతో అనేక ఎఫ్ఐఆర్‌లు

కన్నాట్‌ప్లేస్‌లో శుక్రవారంనాడు లెహ్రాదో త్రివర్ణ ప్రదర్శనకు ముందుగా నిరసనకారులు నిషేధాజ్ఞలను ఉల్లంఘించారన్న పేరుతో ఢిల్లీ పోలీసులు ప్రదర్శకులపై అనేక ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.అనేకసార్లు హెచ్చరికలు చేసినప్పటికీ ప్రదర్శకులు అక్కడినుండి వెళ్ళిపోలేదని,దీంతో తాము చట్టపరమైన చర్యలు తీసుకుని అరెస్టులు చేసి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని పోలీసులు శనివారం చెప్పారు. భారతీయ నాగరిక్ సురక్షిత్ సంహిత లోని సెక్షన్ 163 కింద ఈ నిషేధ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ వందలమంది సిజెపి మద్దతుదారులు,విద్యార్థులు వరుసగా కన్నాట్‌ప్లేస్‌లో మెరుపు ప్రదర్శనలకు పాల్పడ్డారని చెప్పారు. శుక్రవారంనాడు ఈ ప్రాంతంలో భారీఎత్తున పోలీసులను మోహరించారు.

సిజెపి నేతలకు తీహార్ జైలులో ప్రత్యేక గదులు

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఎలాంటి అనుమతి లేకుండా ప్రవేశించారనే ఆరోపణలతో అరెస్టయిన కామ్రేడ్ జనతా పార్టీ (సిజెపి) నేతలు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌ను తీహార్ జైలులో ప్రత్యేక హైసెక్యూరిటీ వార్డుల్లో వేర్వేరుగా ఉంచినట్లు అధికారులు వెల్లడించారు.

జైలు రికార్డుల ప్రకారం అశుతోశ్ రాంకా ఖైదీ నంబర్ 1784 కాగా, సౌరవ్ దాస్ ఖైదీ నంబర్ 3752. మొదట వీరిద్దరినీ జైలు నంబర్ 2లోనే ఉంచారు. ఆ తర్వాత అశుతోశ్ రాంకాను జైలు నంబర్ 4కి మార్చారు. ప్రస్తుతం సౌరవ్ దాస్ జైలు నంబర్ 2లోని వార్డ్ నంబర్ 3లో ఉండగా, రాంకా జైలు నంబర్ 4లోని వార్డ్ నంబర్ 15లో ఉన్నారు.

ఐటి టవర్స్! (4వ పేజీ తరువాయి)

నిర్వహించారు. అనంతరం రథాన్ని ముందుకు లాగి ప్రారంభించారు. మాడ వీధుల్లో ఊరేగింపునకు సిద్ధమైన అమ్మవారి రథం ప్రారంభం కావడం సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే నాయిని రాజేంద

కిడ్నాప్ ముఠా గుట్టురట్టు

10 మంది నిందితులు అరెస్ట్

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: వ్యాపారిని కిడ్నాప్ చేసి రూ. 1.30 కోట్ల పరిహారం వసూలు చేసిన తీవ్ర సంచలనాత్మక కేసులో 10 మంది సభ్యుల ముఠాను చిక్కడపల్లి పోలీసులు, సికింద్రాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా చాకచక్యంగా అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.1,07 కోట్లు, 118.26 గ్రాముల బంగారు ఆభరణాలు, 5 వాహనాలు (3 కార్లు, 2 ద్విచక్రవాహనాలు), 9 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన నిందితుల్లో పలువురికి గతంలో కిడ్నాప్, దోపిడీ, చీటింగ్ వంటి తీవ్రమైన నేర చరిత్ర ఉంది. సికింద్రాబాద్ జోన్ డిసిపి రక్షిత కృష్ణమూర్తి, టాస్క్‌ఫోర్స్ డిసిపి వైభవ్ గైక్వాడ్, అడిషనల్ డిసిపి జె.నరసయ్య, చిక్కడ్పల్లి ఎసిపి జి.రణవీర్‌రెడ్డి పర్యవేక్షణలో చిక్కడ్పల్లి సీఐ ఎల్.మధుబాబు, టాస్క్‌ఫోర్స్ సిఐ రాజశేఖర్, కాచిగూడ డిఐ రాఘవేంద్ర, చిక్కడ్‌పల్లి డిఎస్ఐ కరీం, వారి సిబ్బంది ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసినందుకు కోత్వాల్ సజ్జనార్ అభినందించి పురస్కారాలు ప్రకటించారు.

వీడిన దోపిడీ కేసు మిస్టరీ

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ : సంచలనం సృష్టించిన రూ.25 లక్షల దోపిడీ కేసును నాంపల్లి పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. నేరానికి సంబంధించి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేయగా, వారి వద్ద నుంచి రూ. 11,50,000 నగదు, 3 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సంచలనాత్మక దోపిడీ కేసును స్వల్ప వ్యవధిలోనే ఛేదించి, ఐదుగురు నిందితులను అరెస్ట్ చేయడమే కాకుండా రూ.11.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్న నాంపల్లి సిఐ, ఎస్ఐ, క్రైమ్ టీమ్ సిబ్బందిని ఖైరతాబాద్ జోన్ డిసిపి ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
ఆదివారం
18-10-2026
www.prajapaksham.in

ప్రజాపక్షం 8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

చెడుపై మంచి ఎప్పుడూ గెలుస్తుంది: సిజెఐ సూర్యకాంత్

బెంగళూరు: నివర్సిటీ పవిత్రతను దెబ్బతీ సేందుకు, విద్యార్థుల భవిష్యత్తుపై నీళ్లు చల్లేందుకు బయటి శక్తులు తెరవెనుక ప్రయత్నాలు చేశాయని సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఎంత మంది అడ్డుకోవాలని చూసినా చివరకు చెడుపై మంచి గెలుస్తుందని, నిజాయతీ పరులదే అంతిమ విజయమని వ్యాఖ్యానించారు. శనివారం జరిగిన నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా నివర్సిటీ (ఎన్ఎల్ఎస్ఐ) 34వ స్నాతకోత్సవంలో జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ కొత్తగా పట్టాలు అందుకుంటున్న యువ న్యాయవాదులు కేవలం చట్టాలను చదవడమే కాకుండా, విభిన్న అభిప్రాయాలను గౌరవించే తత్వాన్ని, మేధో స్వతంత్రతను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అవతలి వారి వాదన వినకుండా తొందరపడి ఎలాంటి నిర్ణయాలకు రావద్దని హితవు పలికారు. ఈ ఏడాది ఆగస్టులో జరగాల్సిన ఎన్ఎల్ఎస్ఐ స్నాతకోత్సవం నిర్వహణపై తీవ్ర ప్రతిష్టంభన ఏర్పడింది. ముఖ్య అతిథిగా జస్టిస్ సూర్యకాంత్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మానన్ కుమార్ మిశ్రాను ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ ఎన్ఎల్ఎస్ఐ విద్యార్థులు, గ్రాడ్యుయేట్లు, పూర్వ విద్యార్థులు బహిరంగ లేఖ విడుదల చేశారు. గతంలో హైదరాబాద్‌లోని నల్సార్ నివర్సిటీ విద్యార్థులు తమ క్యాంపస్‌ను సందర్శించనున్న సిజెఐ పర్యటనను వ్యతిరేకించారు. దీనిపై స్పందించిన బిసిఐ... నల్సార్‌కు చెందిన 2026 గ్రాడ్యుయేటింగ్ విద్యార్థులు ఎలాంటి న్యాయవాద వత్తి నమోదు (ఎన్‌రోల్‌మెంట్) చేసుకోకుండా నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వెల్లువెత్తడంతో ఆ ఉత్తర్వులను బిసిఐ వెనక్కి తీసుకుంది. విద్యార్థుల భావప్రకటన స్వేచ్ఛను అణచివేసేలా బీసీఐ వ్యవహరించిన తీరును, దానికి నాయకత్వం వహించిన బిసిఐ చైర్మన్‌ను ఎన్ఎల్ఎస్ఐ విద్యార్థులు తప్పుబట్టారు. అలాంటి వ్యక్తులను నివర్సిటీ స్నాత కోత్సవానికి ఆహ్వానించి విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయడం తమను అవమానించడమేనని వాదించారు.

విద్యార్థుల నుంచి వ్యక్తమైన తీవ్ర వ్యతిరేకత, నిరసనల కారణంగా ఆగస్టు చివరి వారంలో జరగాల్సిన ఈ స్నాతకోత్సవం అప్పట్లో రద్దయింది. విద్యార్థులకు డిగ్రీలను నేరుగా హాజరుకాకుండా అందజేస్తామని నివర్సిటీ తెలిపింది. అయితే అన్ని అడ్డంకులను దాటుకుని తాజాగా ఈ వేడుకను విజయవంతంగా నిర్వహించారు.

మమ్మల్ని బెదిరించగలరు...
మా గొంతు నొక్కేయలేరు

నిరసనకారులకు లైంగిక వేధింపులపై ఆగ్రహం

ఢిల్లీ పోలీస్ కేంద్ర కార్యాలయానికి కదం తొక్కిన మహిళలు



న్యూఢిల్లీ: 'మమ్మల్ని బెదిరించగలరుగానీ మా గొంతు నొక్కేయలేరు' అంటూ ఢిల్లీ పోలీసుల తీరుపై మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ఢిల్లీలో చేపట్టిన ఆందోళనల్లో పాల్గొన్న మహిళలు, ట్రాన్స్‌జెండర్లను పోలీసులు లైంగికంగా వేధించారని, అలాంటి సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేశారు. ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ ఢిల్లీ పోలీసుల కేంద్ర కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. మహిళా సంఘాలైన ఐద్వా, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, ఏఐపీడబ్ల్యూఏ, ఏఐఎంఎస్ఎస్, అలీఫా, ఏఐసీసీడబ్ల్యూడబ్ల్యూతో పాటు ప్రగతిశీల్ మహిళా సంఘటన్, పురోగమి మహిళా సంఘటన్ అధ్వర్యంలో ఈ మార్చ్ జరిగింది. అన్ని రకాల వేధింపులు, అణచివేతల నుంచి మహిళలు స్వేచ్ఛ/స్వాతంత్ర్యాన్ని డిమాండ్ చేస్తున్నారు' అన్న బ్యానర్లను నిరసనకారులు ప్రదర్శించారు. మహిళలు, ట్రాన్స్‌జెండర్లపై పోలీసుల హింస, అణచివేతను తక్షణమే ఆపేయాలని డిమాండ్ చేశారు. స్థానిక గురుద్వారా బంగ్లా సాహిబ్ నుంచి మహిళల ప్రదర్శన ప్రారంభమైంది. ఢిల్లీ పోలీసుల కేంద్ర కార్యాలయానికి చేరుకున్న మహిళలు... అక్కడ అదనపు డిసిపి జగదీప్ సింగ్‌ను కలిశారు. తమ వినతిపత్రం అందజేశారు. మహిళా నిరసనకారులతో అనుచితంగా ప్రవర్తించిన సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు, చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లైంగిక వేధింపులు జరిగాయన్నది ఆరోపణ మాత్రమే కాదని ఇందుకు వీడియోఫొటో సాక్ష్యాలు ఉన్నాయని తెలిపారు. జులై 20 నుంచి అక్టోబరు 2 వరకు పరిణామాల వీడియోలు, ఫొటోలతో పాటు ప్రత్యక్ష సాక్షులు, బాధితుల వాంగ్మూలాలు ఉన్నట్లు వెల్లడించారు. ఓ యువ మహిళా జర్నలిస్టును ఏసిపి స్థాయి అధికారి అసభ్యంగా తాకగా, ఆమె ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నిస్తే, నిర్బంధించడమే కాకుండా ఆమెతో పాటు ఇతరులపై ఎఫ్ఐఆర్ దాఖలు చేశారని మహిళా నేతలు మండిపడ్డారు.

'రామరాజ్యం' ఆదర్శం ఏమైంది?

లద్దాఖ్ ప్రజలకు బిజెపి దగా: వాంగ్‌చుక్

న్యూఢిల్లీ: 'మనం ఎలాంటి రామరాజ్యం గురించి మాట్లాడుకుంటున్నాం?' అని పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ప్రశ్నించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు, లద్దాఖ్ నాయకులకు మధ్య జరిగిన చర్చలు ఎటువంటి పురోగతి లేకుండా ముగిసిన తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. లద్దాఖ్ ప్రజలకు ఇచ్చిన హామీ నుంచి కేంద్రం వెనక్కి తగ్గిందని ఆరోపించారు. లద్దాఖ్ ప్రజలు తీవ్ర విచారం, ఆశ్చర్యం, ఆగ్రహంతో ఉన్నారని పేర్కొన్న వాంగ్‌చుక్, 'రామరాజ్యం' అనే ఆదర్శం ఏమైందని ప్రశ్నించారు. 'ప్రాణం పోయినా సరే, ఇచ్చిన మాట తప్పకూడదు' అనేదే కదా రామరాజ్యంలోని ప్రధాన సూత్రం! అని అన్నారు. 'నిన్న మేము దిగ్భ్రాంతికి గురయ్యాము. మా మధ్య చిన్నపాటి భేదాభిప్రాయాలు ఉండవచ్చని అనుకున్నాం. కానీ అవి చాలా పెద్దవిగా ఉన్నాయి. వారు (కేంద్రం) మళ్లీ మాట తప్పారు' అని వాంగ్‌చుక్ శనివారం ఒక వీడియో ప్రకటనలో తెలిపారు. 'ఆసెంబ్లీ చాలా పరిమిత అధికారాలతో ఉంటుందని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కూడా దాని పరిధిలోకి రారని వారు చెప్పారు. అంతేకాదు, ఆర్టికల్ 371 కింద కల్పిస్తామన్న హామీల నుంచి కూడా వారు వెనక్కి తగ్గారు' అని అన్నారు. ఈ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్న వాంగ్‌చుక్, గతంలో జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద ఆరు నెలల పాటు జైలు శిక్ష కూడా అనుభవించారు. ఆరవ షెడ్యూల్‌కు బదులుగా... ఆర్టికల్ 371 కింద ప్రత్యేక రక్షణలు కల్పిస్తామన్న కేంద్రం ప్రతిపాదనకు తాము అంగీకరించామని ఆయన తెలిపారు. 'ఆ చర్చల్లో భాగంగా లద్దాఖ్‌కు ప్రత్యేక శాసన సభను కల్పించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని అందిస్తామని, ఈ శాసన సభ పరిధిలోకి ప్రధాన కార్యదర్శితో సహా మొత్తం అధికార యంత్రాంగం వస్తుందని హామీ ఇచ్చారు. అలాగే ఆరవ షెడ్యూల్‌కు బదులుగా ఆర్టికల్ 371 కింద రక్షణలు కల్పిస్తామని చెప్పారు. అందువల్ల మేము మే నెలలో జరిగిన ఆ చర్చల తర్వాత, నిన్నటి సమావేశం మాకు చాలా ముఖ్యమైనది' అని వాంగ్‌చుక్ పేర్కొన్నారు. చర్చలు విఫలమవడంపై మాట్లాడుతూ 'మనం అసలు ఎలాంటి రామరాజ్యం గురించి మాట్లాడుకుంటున్నాం? 'ప్రాణం పోయినా మాట తప్పకూడదు' అనే ఆదర్శం ఏమైంది? శత్రు దేశాలతో పోరాడేటప్పుడు ప్రతి యుద్ధంలోనూ మేమే ముందుండి పోరాడాం. కానీ మన దేశ ప్రభుత్వమే మనల్ని ఇలా చూస్తుంటే, ఇక మనం ఏం చెప్పాలి? మనం ఎక్కడికి వెళ్లాలి?' అని ఆయన ప్రశ్నించారు. కేంద్రానికి, లద్దాఖ్ ప్రతినిధులకు మధ్య జరిగిన చర్చలు ఎటువంటి చెప్పుకోదగ్గ పురోగతి లేకుండా ముగిశాయి. లద్దాఖ్ నాయకులు మాట్లాడుతూ రెండు పక్షాల వైఖరుల మధ్య 'పెద్ద వ్యత్యాసాలు' ఉన్నాయని, ముఖ్యంగా ప్రతిపాదిత ఎన్నికయిన శాసన సభకు ఉండాల్సిన అధికారాల విషయంలోనే ప్రధాన వివాదం నెలకొందని పేర్కొన్నారు. లద్దాఖ్‌పై చైనా చేసిన వ్యాఖ్యలను ప్రజలు ఖండించారని చెప్పిన వాంగ్‌చుక్, ఆ తర్వాత కొన్ని గంటల్లోనే జరిగిన పరిణామం ఆశ్చర్యకరమని అన్నారు. 'నేను ఎప్పుడూ చెబుతూనే ఉన్నాను. మళ్లీ చెబుతున్నాను. లద్దాక్ గురించి మాట్లాడే హక్కు చైనాకు లేదు. నిజం చెప్పాలంటే, వారి మాటలకు మా దృష్టిలో ఎలాంటి విలువ లేదు. మా పొరుగు దేశం టిబెట్... చైనా కాదు. అసలు వారు టిబెట్‌ను ఎప్పుడు ఖాళీ చేసి, అక్కడ నివసించే మా టిబెటన్ సోదర సోదరీమణులకు అప్పగిస్తారు? ఈ అంశంపై లద్దాఖ్‌కు చెందిన 'లేహ్ అత్యున్నత మండలి' నాయకులందరూ ప్రత్యేక విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, చైనా చేసిన వ్యాఖ్యలను ఖండించారు. లద్దాఖ్ ప్రజలు ఎల్లప్పుడూ భారతదేశంలోనే సంతోషంగా ఉన్నారు. ఇక ముందూ అలాగే ఉంటారు. ఇందులో ఆశ్చర్యమేమీ లేదు, మేము ఎప్పుడూ ఇదే చెబుతూ వచ్చాం' అని అన్నారు. అయితే ఆ తర్వాత జరిగిన పరిణామం మాత్రం ఆశ్చర్యకరమని వాంగ్‌చుక్ తెలిపారు. 2019లో లద్దాఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చినప్పుడు ప్రజాస్వామ్యాన్ని కల్పిస్తామని, ఆరవ షెడ్యూల్ కింద రక్షణ కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని వాంగ్‌చుక్ గుర్తు చేశారు. 'ఈ హామీతోనే బిజెపి రెండు ఎన్నికల్లో విజయం సాధించింది. కానీ రెండేళ్లు గడిచిన తర్వాత ఆ హామీ నుంచి పూర్తిగా వెనక్కి తగ్గారు. శాంతియుత నిరసనలు, ఉపవాస దీక్షలు, పాదయాత్రల ద్వారా వారికి ఆ హామీలను గుర్తు చేసే ప్రయత్నం చేసినప్పుడు... సెప్టెంబరు 24 న వారు విచక్షణారహితంగా కాల్పులు జరిపి, మా ప్రజలను పొట్టనబెట్టుకున్నారు. నాలాంటి వారిని జాతీయ భద్రతా చట్టం కింద జైలుకు పంపారు' అని ఆయన విమర్శించారు.

సిజెపి ఉద్యమ అణచివేతపై నిలదీయండి

రుబియోకు అమెరికా కాంగ్రెస్ ఎంపీల లేఖ

వాషింగ్టన్: భారతదేశంలో కాక్రోచ్ జనతాపార్టీ(సిజెపి) ఢిల్లీ, ఇతర ప్రాంతాలలో చేస్తున్న నిరసన ప్రదర్శనలపై కేంద్ర ప్రభుత్వం అణచివేత చర్యలకు పాల్పడాన్ని ప్రశ్నించాలని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియోను కొందరు కాంగ్రెస్ ఎంపీలు కోరారు. మానవ హక్కుల ఉల్లంఘన, అణచివేతపై సమగ్ర, నిష్పాక్షిక విచారణకు ఒత్తిడి తీసుకురావాలని కోరారు. అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా నిర్బంధానికి గురైనవారిని విడుదల చేసేలా ప్రోత్సహించాలని కోరారు. అమెరికాలో ప్రదర్శకులపై భారత దౌత్యకార్యాలయాకలు నిఘా పెట్టాయా? భయపెట్టాయా? అనే విషయంపైన, వచ్చిన ఈ ఆరోపణలపైన దర్యాప్తు చేయాలని కోరారు. ఈ మేరకు వారు రుబియోకు శనివారం ఒక లేఖ రాశారు. వచ్చే వారం రుబియో భారతదేశంలో పర్యటనకు వస్తున్నారు. ఈ సందర్భంగా ఈ అణచివేత చర్యలపై భారత్‌లో ఉన్న అమెరికా ప్రతినిధులు, రాయబారులతో చర్చించాలని, ఢిల్లీ, ఇతర ప్రాంతాల వీధుల్లో కాన్సొలేట్ ఫొటోగ్రాఫర్లను మోహరించాలని కూడా వారు రుబియోను కోరారు. రుబియో ముంబయి నగరానికి చేరుకుని భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్‌తో చర్చల్లో, ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారు.

డెమోక్రటిక్‌పార్టీకి చెందిన కాంగ్రెస్ ఎంపీలు ప్రమీలా జయపాల్, ఒమర్, జిమ్ మెక్‌గవర్న్, రషీదా త్లాయిబ్, ఎలియనోర్ హోమ్స్ నార్టన్, జీనస్ గార్టియాలు ఉమ్మడిగా రుబియోకు ఒక లేఖ రాస్తూ, కాక్రోచ్ జనతాపార్టీకి వ్యతిరేకంగా ప్రభుత్వం నిఘా పెట్టడాన్ని, వారిని అణచివేయడాన్ని ప్రశ్నించాలని, అమెరికా కాన్సొలేట్ ఫొటోగ్రాఫర్లను రంగంలోకి దించాలని కోరారు. ''భారతదేశంలో మితిమీరిన బలప్రయోగం, అణచివేత, నిర్బంధాలను వ్యతిరేకిస్తున్నాం, తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాం'' అని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. ఇంతకుముందు భారత విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ ఉద్యమించినప్పుడు, ఇప్పుడు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ ఉద్యమ సమయంలో మితిమీరినస్థాయిలో ప్రభుత్వం అణచివేత చర్యలకు పాల్పడిందని వారు ఆ లేఖలో రాశారు. భారతదేశంలో 13 కోట్లమంది ఓటర్లను ఓటర్ల జాబితాల నుండి తొలగించడం పట్ల ప్రమీలా జయపాల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కాక్రోచ్ జనతాపార్టీకి పూర్తి మద్దతు ప్రకటించారు. ''మన రెండు దేశాల ప్రజలకు పరస్పర ఆందోళన కలిగించే సమస్యలను మీ పర్యటన సందర్భంగా ప్రస్తావించండి'' అని కోరారు. ఐతే మార్కో రుబియోకు ఈ విధంగా లేఖ రాయడాన్ని వైట్‌హౌస్ మాజీ సలహాదారు అజయ్ జైన్ భూటోరియా తీవ్రంగా తప్పుపట్టారు. ''భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశం, దానికి స్వతంత్ర న్యాయస్థానం, స్వతంత్ర ఎన్నికల వ్యవస్థ ఉన్నాయి, పత్రికాస్వేచ్ఛ ఉంది, దాన్ని తప్పుపట్టడం తగదు, ఈ విషయంలో తల దూర్చి నీతులు చెప్పడం, ఇలా చేయడంవల్ల అమెరికా–భారత్ కీలక భాగస్వామ్యం దెబ్బతింటుంది, మీరు అమెరికా సమస్యలపై దృష్టి పెట్టండి'' అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. భూటోరియా గతంలో అధ్యక్షుడు జోబైడెన్‌కు సలహాదారుగా పనిచేశారు.

కాలువలో పడిన మినీబస్సు

8 మంది మృతి, 15 మందికి గాయాలు

రాజస్థాన్ కోటా జిల్లాలో ఢిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్‌వేపై ఘటన

కోటా : రాజస్థాన్ కోటా జిల్లాలో ఢిల్లీ – ముంబయి ఎక్స్‌ప్రెస్‌వేపై శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. 23 మంది ప్రయాణికులతో వెళ్తున్న మినీబస్సు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి 15 అడుగుల లోతైన కాలువలో పడిపోయింది. ఈ ఘటనలో మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లాకు చెందిన ఎనిమిది మంది మృతి చెందగా, 15 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. క్షతగాత్రుల్లో 8 మంది పరిస్థితి విషమంగా ఉంది. పొరుగు రాష్ట్రంలోని కోటా జిల్లాలో, సిమ్లియా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎక్స్‌ప్రెస్‌వేపై పోల్ నంబర్ 384 సమీపంలో ఉదయం 6 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. మృతులు బేతుల్ జిల్లా కేంద్రానికి సుమారు 65 కిలోమీటర్ల దూరంలో ఉన్న ముల్తాయ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘట్‌బిరోలి గ్రామానికి చెందిన వారని బేతుల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వీరేంద్ర జైన్ పిటిఐకి తెలిపారు. లోతైన కాలువలో పేరుకుపోయిన పూడిక, నీరు సహాయక చర్యలకు ఆటంకం కలిగిస్తున్నప్పటికీ, అత్యవసర సిబ్బంది వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. దెబ్బతిన్న వాహనాన్ని బయటకు తీయడానికి, లోపల చిక్కుకున్న ప్రయాణికులను రక్షించడానికి క్రేన్‌లను రంగంలోకి దించారు. బాధితులు ఒకరికొకరు బంధువులని, రాజస్థాన్‌లోని సికార్ జిల్లాలో ఉన్న ఖాటు శ్యామ్ ఆలయాన్ని సందర్శించేందుకు శుక్రవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో భోపాల్ నుండి బయలుదేరారని పోలీసులు తెలిపారు. కోటా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సుజిత్ శంకర్ ప్రకారం ఈ బృందం నాలుగు రోజుల పర్యటన కోసం రాజస్థాన్‌కు వచ్చి, ఆలయానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిలో ఎనిమిది మంది పరిస్థితి విషమంగా ఉందని, వారిని న్యూ మెడికల్ కాలేజ్ హాస్పిటల్, బిఎంఎస్ ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. గాయపడిన ప్రయాణికులలో ఒకరైన అన్నిక, తాను తన మామయ్యలు, అత్తయ్యలు, ఇతర బంధువులతో కూడిన తన కుటుంబంతో కలిసి ప్రయాణిస్తున్నానని చెప్పింది. వారు శుక్రవారం సాయంత్రం 7 గంటలకు భోపాల్ నుండి బయలుదేరి, ఖాటు శ్యామ్‌జీ ఆలయంలో దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని ఆమె తెలిపింది. వాహనంలో సుమారు 23 మంది ప్రయాణికులు ఉన్నారని, ప్రమాదం జరిగినప్పుడు వారిలో చాలా మంది నిద్రపోతున్నారని, డ్రైవర్ కునుకు తీసి ఉంటాడని అన్నిక పేర్కొంది. కాగా, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 4 లక్షలు అందించడంతో పాటు, ఈ కష్ట సమయంలో అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. ఘటన అత్యంత విషాదకరమైనదిగా, హృదయ విదారకమైనదిగా అభివర్ణించారు. మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, ఈ నష్టాన్ని భరించే శక్తిని వారి కుటుంబాలకు ప్రసాదించాలని యాదవ్ బాబా మహాకాల్‌ను ప్రార్థించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

గద్దె దించడం ప్రతిపక్షం కర్తవ్యం

'ప్రభుత్వ మార్పు' వ్యాఖ్యను సమర్థించుకున్న కాంగ్రెస్

న్యూఢిల్లీ : ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల సందర్భంగా విద్యార్థి కార్యకర్త నేహా బోరా, సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన రాజకీయ వివాదం నడుమ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం శనివారం ప్రజాస్వామ్యంలో 'ప్రభుత్వ మార్పు' అనే వ్యాఖ్యలు చేయడాన్ని సమర్థించారు. 'ఎక్స్' లో చేసిన ఈ పోస్ట్‌లో... ఈ వ్యాఖ్యలపై బిజెపి స్పందనను చిదంబరం ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని 'వ్యతిరేకించడం, బట్టబయలు చేయడం, గద్దె దించడం' ప్రతిపక్ష కర్తవ్యం అని ఆయన అన్నారు. 'ప్రభుత్వ మార్పు' అనే వ్యాఖ్యలపై బిజెపి ఎందుకు కృత్రిమ ఆగ్రహంతో ఊగిపోతోంది? ప్రజాస్వామ్యంలో 'పాలన మార్పు' అనేది సహజమైన ప్రక్రియ. ప్రతిపక్షం బాధ్యత ప్రభుత్వాన్ని 'వ్యతిరేకించడం, బట్టబయలు చేయడం, గద్దె దించడం'. అంటే : రాజకీయాల్లో వ్యతిరేకించడం, పార్లమెంటులో లోపాలను ఎండగట్టడం, ఎన్నికల ద్వారా ప్రభుత్వాన్ని గద్దె దించడం అని అర్థం' అని చిదంబరం పేర్కొన్నారు. జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనను భూషణ్ 'ప్రభుత్వ మార్పు కోసం పోరాటం' గా అభివర్ణించగా, బోరా బంగ్లాదేశ్‌లోని జెన్‌జీ ఉద్యమాన్ని ప్రస్తావించడంతో ఈ వివాదం చెలరేగింది.

ఆసుపత్రిలో చేరిన అద్వానీ

నిలకడగానే ఆరోగ్యం : వైద్యులు వెల్లడి

న్యూఢిల్లీ : ఛాతీ ఇన్‌ఫెక్షన్‌తో ఆసుపత్రిలో చేరిన బిజెపి అగ్రనేత, మాజీ ఉపప్రధానమంత్రి ఎల్‌కె అద్వానీ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని ఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో ఆయనకు చికిత్స అందిస్తున్నామని తెలిపాయి. శుక్రవారం రాత్రి తీవ్ర అస్వస్థకు గురైన అద్వానీని ఆసుపత్రికి తీసుకొచ్చినట్లు ఆయన కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతం ఆయన న్యూరాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ వినీత్ సూరి పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటున్నారని ఆసుపత్రి ఒక ప్రకటనలో తెలిపింది. 98 ఏళ్ల వయసున్న అద్వానీ గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ ఏడాది మేలో కూడా వయో సంబంధిత సమస్యలతో ఆయన ఇదే ఆసుపత్రిలో చేరారు. అప్పట్లో కొన్ని రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొంది డిశ్చార్జి అయ్యారు. అద్వానీ ఆరోగ్య పరిస్థితి పరిస్థితి గురించి తెలుసుకున్న పలువురు రాజకీయ నేతలు, ఆయన అభిమానులు ఆయన త్వరగా కోలుకోవాలని, పూర్తి ఆరోగ్యంగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నారు. ఎల్‌కె అద్వానీ పూర్తి పేరు లాల్‌కృష్ణ అద్వానీ. దేశ రాజకీయాల్లో సుదీర్ఘకాలం పాటు కీలక పాత్ర పోషించారు. అంతేకాదు, కేంద్రంలో పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే, భారతీయ జనతా పార్టీ (బిజెపి) చరిత్రలోనే అత్యంత ప్రముఖ మైన అగ్ర నాయకుల్లో ఒకరిగా నిలిచారు. ప్రారంభంలో ఒక చిన్న రాజకీయ శక్తిగా ఉన్న బిజెపిని, దేశంలోనే అధికార పీఠాన్ని కైవసం చేసుకునే స్థాయికి చేర్చడంలో ఆయన పోషించిన పాత్ర కీలకం.

జనగణన మరో ఎస్ఐఆర్: కాంగ్రెస్

న్యూఢిల్లీ: బిజెపి ఆర్ఎస్ఎస్ కలిసి మరో సంస్థను నాశనం చేస్తున్నాయని కాంగ్రెస్ విమర్శించింది. ఎస్ఐఆర్ మాదిరిగానే జనగణననూ తారుమారు చేస్తారని హెచ్చరించింది. ఒక్కొక్కటిగా అన్ని వ్యవస్థలు నాశనమై పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. జనగణన2027 కోసం ఎన్యుమరేటర్ల అర్హత పరిధిని విస్తరించడం ద్వారా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన రాజకీయ అజెండాను అమలు చేస్తోందని విమర్శించింది. ఆర్ఎస్ఎస్ శిక్షణ శిబిరానికి, జనాభా మార్పులపై ఏర్పాటు చేసిన ఒక ప్యానెల్‌కు దీనికి సంబంధం ఉందని ఆరోపించింది. ఈ పరిణామాల క్రమంలో జనగణన ప్రక్రియపై అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ శనివారం వ్యాఖ్యానించారు. ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ ప్రైవేటు విద్యాసంస్థల టీచర్లను జనాభా లెక్కల అధికారులుగా నియమించేందుకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఇందుకోసం జనగణన నిబంధనలు సవరించింది. దీంతో తాజా ప్రక్రియ జరగబోయే తీరుపై అనుమానాలు వ్యక్తమయ్యాయని జైరాం రమేశ్ ఎక్స్ మాధ్యమంగా వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వం జనగణన కోసం అర్హులైన ఎన్యుమరేట్లర్ల జాబితాను విస్తరించడంలో కుట్ర దాగివుందని ఆరోపించారు. తాజా పరిణామాలతో పదేళ్లకు ఒకసారి జరిగే జనాభా లెక్కల ప్రక్రియ విశ్వసనీయతను దెబ్బతింటుందని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ ఏడాది జులై 10, 11, 12 తేదీల్లో కర్నాటక, బెళగావిలో నిర్వహించిన ఆర్ఎస్ఎస్ శిక్షణ శిబిరంతో జనగణన నోటిఫికేషన్‌కు ముడిపెట్టారు. ఈ శిబిరంలో జనగణన 2027పై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలిపారు. మే 26న కేంద్ర హోంశాఖ ఏర్పాటు చేసిన జనాభా మార్పులపై ఉన్నత స్థాయి కమిటీని జైరాం రమేశ్ ప్రస్తావించారు. ఈనెల 14న దేశవిదేశాల సంస్థల నుంచి అభిప్రాయాలను కమిటీ కోరినట్లు తెలిపారు. ఉన్నత స్థాయి కమిటీ సభ్యులకు ఆర్ఎస్ఎస్‌తో సంబంధాలు ఉన్న నేపథ్యంలో సంబంధిత సమాచారం మూలం ఏమిటో తెలిసిందని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. తాజా విస్తరణను వేలాది మంది ఆర్ఎస్ఎస్/బిజెపి కార్యకర్తలకు 'రోజ్‌గార్ గ్యారెంటీ యోజన' (ఉపాధి హామీ పథకం)గా జైరాం రమేశ్ అభివర్ణించారు. దీని వల్ల జనగణన ప్రక్రియ మరింతగా దెబ్బతింటుందని ఆయన హెచ్చరించారు.

సిఇసి, ఎస్ఐఆర్‌పై దేశవ్యాప్త పోరు ఆగదు

ప్రకాశ్ రాజ్ పునరుద్ఘాటన

తిరువనంతపురం: సిఇసి జ్ఞానేశ్ కుమార్‌కు, ఓటర్ల జాబితాల ప్రక్షాళన (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా శాంతియుతంగా ఆందోళనలునిరసనలు కొనసాగుతాయని ప్రముఖ నటుడు, హక్కుల కార్యకర్త ప్రకాశ్ రాజ్ పునరుద్ఘాటించారు. అణచివేసేందుకు ప్రయత్నించినా పోరాటం ఆగదని స్పష్టంచేశారు. కేరళం, తిరువనంతపురంలో మనవీయం వీధిలో సిఇసి, ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలో పాల్గొన్న ప్రకాశ్ రాజ్ అక్కడ విలేకరులతో మాట్లాడారు. మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్, భగత్ సింగ్ స్ఫూర్తితో దేశ యువత ఉద్యమ బాటలో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. 'మాలో గాంధీ రక్తముంది. అంబేద్కర్ రక్తముంది. భగత్ సింగ్ రక్తముంది. మా పోరాటం కొ

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
ఆదివారం
18-10-2026
www.prajapaksham.in

ప్రజాపక్షం 8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com

భూపాలపల్లి జిల్లా మరియు పట్టణ ప్రజలకు, సింగరేణి కార్మికులకు, ఉద్యోగులకు,అధికారులకు, నాయకులకు, ప్రజాపక్షం
8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.
మరియు దసరా శుభాకాంక్షలు
ప్రజాపక్షం
కూ. సీతారామయ్య
కూ. రాజ కుమార్
M. రమేష్ బ్రాంచ్ సెక్రటరీ
M. రామ్‌చందర్ వైస్ ప్రెసిడెంట్
ఏ. సదయ్య కేటీకే -1
ఎండి. కరీముల్లా కేటీకే ఓ సీ-2
వి. రాజేందర్ కేటీకే -5
పీ. శ్రీనివాస్ కేటీకే -6
ఎల్. శంకర్ కేటీకే కే ఎల్ పి - 8
ఎస్. కృష్ణారెడ్డి కేటీకే ఓ సీ- 3
డి. శ్రీనివాస్ ఏరియా స్టోర్ వర్క్‌షాప్
ఎన్. రమేష్ ఏరియా హాస్పిటల్
ఎస్. సాంబయ్య ఎస్ & పి
డి. పోశయ్య కోల్ షాంప్లింగ్
SCWU/ ఏఐటీయూసీ ఫిట్ కమిటీ భూపాలపల్లి ఏరియా

ప్రజాపక్షం దినపత్రిక
8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
బండి స్వామి
తాడిచర్ల సర్పంచ్
ప్రజాపక్షం
8వ వార్షికోత్సవం శుభాకాంక్షలు
బొబ్బలి రాజు
ఉపసర్పంచ్, తాడిచర్ల
ప్రజాపక్షం
8వ వార్షికోత్సవం శుభాకాంక్షలు
బండారి నర్సింగా రావు
సర్పంచ్, పెద్దతూండ్ల

BJP
ప్రజాపక్షం
8వ వార్షికోత్సవం శుభాకాంక్షలు
బండ శ్రీకాంత్
బీజేపీ మండల అధ్యక్షులు
ప్రజాపక్షం
SRI SAIVANI VIDYANIKETHAN
ENGLISH MEDIUM SCHOOL
Vill: Tadicherla, Mdl: Malharrao,Dist: Jayashankar Cell 96767 32155
మల్లూర్ మండల బందుమిత్రులకు, ప్రజలకు ప్రజాపక్షం
జాతీయ దినపత్రిక 8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
జల్లారపు ప్రసాద్
నవ్య శ్రీ డిజిటల్స్
ప్రజాపక్షం విలేకరి

సద్దుల బతుకమ్మ మరియు దసరా శుభాకాంక్షలు

భూపాలపల్లి మున్సిపాలిటీ ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు,
నాయకులకు, మిత్రులకు...
8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.
మరియు
దసరా
శుభాకాంక్షలు
గండ్ర సత్యనారాయణ రావు గారు
భూపాలపల్లి ఎమ్మెల్యే
దాట్ల శ్రీనివాస్
కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు భూపాలపల్లి.

ప్రజా పక్షం
దినపత్రిక 8వ వార్షికోత్సవం సందర్భంగా
యాజమాన్యానికి, పాఠకులకు, పాత్రికేయులకు,
మరియు సిబ్బందికి అలాగే
గన్నేరువరం మండలం ప్రజలకు,
నాయకులకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు,
బతుకమ్మ, దసరా మరియు దీపావళి
శుభాకాంక్షలు
బోడ్డు సునీల్
కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, గన్నేరువరం
కొమ్మెర రవీందర్ రెడ్డి
కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు
చింతల శ్రీధర్ రెడ్డి
కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గన్నేరువరం

భూపాలపల్లి జిల్లా మరియు పట్టణ ప్రజలకు, సింగరేణి కార్మికులకు,
ఉద్యోగులకు,అధికారులకు, నాయకులకు, ప్రజాపక్షం
8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.
మరియు
దసరా
శుభాకాంక్షలు
M. రమేష్ బ్రాంచ్ సెక్రటరీ
M. రామ్‌చందర్ వైస్ ప్రెసిడెంట్
G. సుధాకర్ రెడ్డి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ
G. శ్రీనివాస్ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ
Md. ఆసిఫ్ పాషా అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ
N. చంద్రమౌళి కాంట్రాక్ట్ కార్మికుల ఇంచార్జ్
T. రామ్‌చందర్ ఫైనింగ్ స్టాప్ ఇంచార్జ్
M. రవి కుమార్ టెక్నికల్ ఇంచార్జ్
సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ - (AITUC) భూపాలపల్లి

ప్రతినిత్యం ప్రజల మన్ననలు పొందుతూ
ప్రజల పక్షాన నిలుస్తున్న
"ప్రజాపక్షం"
దినపత్రికకు
8వ వార్షికోత్సవం
శుభాకాంక్షలు.
వీలం సాయి కుమార్
సర్పంచ్, పాలాట

ప్రజాపక్షం
ప్రజల గొంతుకగా పనిచేస్తూ..
ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా అక్షరమై వెలుగొందుతున్న
ప్రజాపక్షం దినపత్రికకు
8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
సర్వ మండల ప్రజలకు, గ్రామ ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
దసరా మరియు దీపావళి శుభాకాంక్షలు
కవిత
మహిళా సమైక్య మండల అధ్యక్షురాలు
మల్లేశ్వరి
కార్యదర్శి
సంతోషం
కోశాధికారి
అమృత
అకౌంటెంట్
చెన్నప్ప సర్వ
APM
వెంకటయ్య
CC
రాము
కంప్యూటర్ ఆపరేటర్
మహిళా మండల సమాఖ్య - సర్వ మండలం,
నారాయణపేట జిల్లా.

ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
పాఠకులకు, యాజమాన్యానికి, సిబ్బందికి
"ప్రజాపక్షం" దినపత్రిక 8వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
కృష్ణ & మాగనూర్ మండలాల
గ్రామ ప్రజలకు,
ప్రజాప్రతినిధులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు
దసరా & దీపావళి
శుభాకాంక్షలు
సగరం రమేష్
BSP పార్టీ 'మాగనూర్ మండల అధ్యక్షుడు

జిల్లా అధికారులకు,నాయకులకు, ప్రజాపక్షం పాఠకులకు,
ప్రకటనకర్తలకు, విలేకరులకు, సిబ్బందికి, యాజమాన్యానికి
ప్రజాపక్షం దినపత్రిక
8వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
మరియు
దసరా
శుభాకాంక్షలు
Mr. ANISHETTY BHANUCHANDAR
CORRESPONDENT M.A., B.ED.
SHINE HIGH SCHOOL
2.0 CAMPUS
& Gandhi Nagar, Bhupalpally.

మల్లు రవికి కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం

ప్రజాపక్షం/షాద్‌నగర్: ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశానికి వెళ్తున్న నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లురవికి స్థానిక కాంగ్రెస్ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. శనివారం షాద్‌నగర్ బైపాస్ రహదారిపై స్థానిక మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ ఆధ్వర్యంలో ఎంపి మల్లురవిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. నూతనంగా డివిజన్ ఎస్సీ సెల్ చైర్మన్‌గా ఎన్నికైన జాంగారి రవిని ఎంపి మల్లురవికి పరిచయడం చేయడంతో పాటు సన్మానించారు. గ్రామీణ స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతోపాటు వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ రఘునాయక్, కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇబ్రహీం, మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్, కాంగ్రెస్ నేతలు బాదేపల్లి సిద్ధార్థ, గడ్డం జంగయ్య, చెన్నగళ్ల జంగయ్య, మహబూబ్‌లు పాల్గొన్నారు.

నిరు పేదలకు అండగా ప్రజా ప్రభుత్వం

ప్రజాపక్షం/షాబాద్: నిరు పేదలకు అండగా ప్రజాపాలన ప్రభుత్వం పని చేస్తుందని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులు గ్రామ సర్పంచ్ కర్రోళ్ల శాంతమ్మ యాదయ్యలతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పేదలకు స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్నబియ్యం అందిస్తున్నట్లు వివరించారు. సర్పంచ్ శాంతమ్మ యాదయ్య మాట్లాడుతూ.. త్వరలోనే గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నా రు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కారిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రవి, బుచ్చమ్మ, శేఖర్, జహంగీర్, అత్తిలి శ్రీనివాస్ రెడ్డి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం బతుకమ్మ

ప్రజాపక్షం/షాద్‌నగర్: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం బతుకమ్మ వేడుకలని, ప్రతి ఇంటిలో మహిళలు సంతోషంగా నిర్వహించుకునే పండుగ అని 16వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ఎస్. స్వాతిరెడ్డి అన్నారు. శనివారం షాద్‌నగర్ కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని వివిధ రంగుల పుష్పాలను తీసుకువచ్చి బతుకమ్మను తయారు చేసి ఆట పాటలతో సందడి చేశారు. కోర్టు ప్రాంగణంలో చేపట్టిన బతుకమ్మ సంబరాలకు ప్రాధాన్యత సంతరించుకుందని చెప్పవచ్చు. ఈ సందర్భంగా 16వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ఎస్.స్వాతి రెడ్డి మాట్లాడుతూ దసరా పర్వదినం పురస్కరించుకొని మహిళలు ఎంతో ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం బతుకమ్మ వేడుకలని, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి షేరినా మహ్మద్, ప్రిన్సిపల్ జూనియర్ సివి ల్ జడ్జి కొత్త రవి, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.సాహితి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.జగన్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసమూర్తి, ఉపాధ్యక్షురాలు సబియా సుల్తానా, న్యాయదులు జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు

ప్రజాపక్షం/షాద్‌నగర్ : భవాని మాత అమ్మవారికి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలను ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి నిర్వహించారు. శనివారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని జానంపేట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ భవాని మాత అమ్మవారికి ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జగన్మాత భవాని దేవి కరుణాకటాక్షాలతో ప్రజలందరికి అంతా మంచి జరగాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు నిండాలని అమ్మవారికి వేడుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్, మాజీ కౌన్సిలర్ రేటికల్ నందీశ్వర్, యుగందర్, ప్రతాప్ రెడ్డి, చెట్ల నర్సింహులు, పాలమాకుల చెన్నయ్య, పోమాల్‌పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్‌రెడ్డి, నేతలు నక్కల వెంకటేష్, రాజేందర్ సింగ్, లింగందాన సర్పంచ్ నాగిళ్ళ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు

ప్రజాపక్షం/కొత్తూరు: భవాని మాత అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నట్లు ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు ఉప్పల దయానంద్ గుప్తా తెలిపారు. శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మందోనిబాయి మైసమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పల దయానంద్ గుప్తా మాట్లాడుతూ జగన్మాత భవాని దేవి కరుణాకటాక్షాలతో ప్రజలందరికి అంతా మంచి జరగాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు నిండాలని అమ్మవారికి వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నేతలు మలిపెద్ది అనిల్ కుమార్, మలిపెద్ది మహేందర్, గుబ్బ లింగం, పరమేశ్వర్, శ్రీనివాస్, వీరస్వామి, వజ్ర లింగం, చందు, శివకుమార్‌లు పాల్గొన్నారు.



పకడ్బందీగా పట్టభద్రుల ఓటర్ల జాబితా

హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్

ప్రజాపక్షం/హైదరాబాద్ : మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి సంబంధించి కొత్త ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోందని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అన్నారు. భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) ఆదేశాల మేరకు పాత ఓటర్ల జాబితాను రద్దు చేసి, నూతనంగా ఓటర్ల నమోదును ప్రారంభించారు. ఈ క్రమంలో అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులతో (ఎఇఆర్‌ఓలు)లతో జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో శనివారం జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్(ఎన్నికలు) బి.సంతోష్‌తో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఓటర్ల నమోదు, పరిశీలన, షెడ్యూల్‌పై కీలక మార్గదర్శకాలను జారీ చేశారు. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 28న పబ్లిక్ నోటీసు విడుదల కాగా, నవంబర్ 6 వరకు ఫారమ్18 దరఖాస్తులను స్వీకరిస్తారు. అనంతరం నవంబర్ 25న ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. నవంబర్ 25 నుండి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలుకు అవకాశం కల్పించారు. దాఖలైన అభ్యంతరాలన్నింటిని డిసెంబర్ 25 నాటికి పరిష్కరించి, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నారు. శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గానికి ప్రతిసారీ కొత్తగా ఓటర్ల జాబితాను తయారు చేయాల్సి ఉన్నందున, పాత జాబితాలో పేర్లు ఉన్నవారు కూడా తప్పనిసరిగా ఫారమ్18 ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. నమోదు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టేందుకు తొమ్మిది జిల్లాల పరిధిలోని ఆర్‌డిఓలు, సబ్ కలెక్టర్‌లను ఎఇఆర్ ఒలుగా, తహశీల్దార్లు, జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్లను డెసిగ్నేటెడ్ అధికారులుగా నియమించారు. ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే అభ్యర్థులు భారతీయ పౌరుడై ఉండి, నదరు తొమ్మిది జిల్లాల పరిధిలో నివాసముండాలి. నివాస ధ్రువీకరణ కోసం ఆధార్ కార్డు, కరెంట్ లేదా వాటర్ బిల్లు, బ్యాంకు పాస్‌బుక్, పాస్‌పోర్ట్ లేదా రిజిస్టర్డ్ అద్దె ఒప్పందం వంటి పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. వీటితో పాటు, అర్హత తేదీ అయిన 2026 నవంబర్ 1 నాటికి కనీసం మూడు సంవత్సరాల ముందే అనగా 31.10.2023 నాటికి గుర్తింపు పొందిన విశ్వవిద్యాల యం నుండి డిగ్రీ లేదా డిప్లొమా పూర్తి చేసి ఉండాలి. పలితాలు వెలువడిన తేదీనే అర్హత తేదీగా పరిగణిస్తారు. స్వీకరించిన ఫారమ్18 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో బిఎల్‌ఓల (బిఎల్‌ఓలు) ద్వారా ఇంటింటికి వెళ్లి కచ్చితంగా సరిచూడాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ దరఖాస్తుదారులను విచారణ కోసం ఆఫీసులకు పిలవకూడదని అధికారులను ఆదేశించారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ దరఖాస్తులతో పాటు స మర్పించే ఆధార్ కార్డుల ప్రతిలోని మొదటి 8 అంకెలనూ భద్రతా కారణాల రీత్యా మాతృక చేయాలని (మాస్కింగ్) స్పష్టం చేశారు. సరైన ఆధారాలు లేని, నకిలీ, చిరునామాలో లేని దరఖాస్తులను తిరస్కరిస్తారని, అయితే కేవలం డాక్యుమెంట్లు లేవనే నెపంతో దరఖాస్తును తిరస్కరించకుండా బిఎల్‌ఓలు స్వయంగా వెళ్లి పత్రాలు సేకరించాలని సూచించారు. మొత్తం తొమ్మిది జిల్లాల పరిధిలో ప్రాథమికంగా 656 పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. ప్రతి పోలింగ్ కేంద్రం భౌతిక స్థితిని 100 శాతం తనిఖీ చేసి ఓ టర్ల సంఖ్యకు అనుగుణంగా రేషనలైజేషన్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ ఎన్నికల నిర్వహణకు అవసరమైన కంప్యూటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల ఏర్పా టు, బడ్జెట్ విడుదల ప్రక్రియను కూడా వేగవంతం చేశామని కర్ణన్ తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ప్రజాపక్షం/శంకర్‌పల్లి: పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, శానిటేషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్మికులు లేకపోతే అభివృద్ధి చెందదని, వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసమే ఈ రక్షణకు కిట్లు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, వైస్ చైర్ పర్సన్ శ్వేతా పాండురంగారెడ్డి, కమిషనర్ యోగేష్, కౌన్సిలర్లు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు బట్టలు పంపిణీ..

ప్రజాపక్షం/ యాచారం : మండల పరిధిలోని మేడిపల్లి నక్కర్ల గ్రామంలో దసరా పండుగను పురస్కరించుకోని పంచాయతీ కార్మికులకు బట్టలను పంపిణీ చేసినట్లు గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ అన్నారు. శనివారం యాచారం మండల కేంద్రంలో అయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పాలన వ్యవస్థలో పంచాయతీ కార్మికుల పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దెంది మధుకర్‌రెడ్డి., పంచాయతి కార్యదర్శి శ్రీల త, వార్డు సభ్యులు మక్కపల్లి మహేశ్, పంగూరి మనోహర, తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానసరస్వతి ఆలయంలో ఘనంగా ఉత్సవాలు..

ప్రజాపక్షం/యాచారం : మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో విజయ దశమిని పురస్కరించికుకొని దేవి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. అమ్మవారు మహలక్ష్మి అమ్మవారి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ కమిటీ నిర్మాకులు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఎర్పాట్లు చేశారు. గ్రామంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శనివారం 108 మంది దంపతులతో మహచండి యాగం నిర్వహించారు. విశిష్ట పర్వ దినాల్లో అలంకరించిన చీరలను వేలంలో అమ్మవారి ప్రసాదంగా పోందిన వారికి అత్మీయ సన్మానం నిర్వహించారు.

దుర్గామాత మంటపాల్లో డిసిసి అధ్యక్షురాలు ప్రత్యేక పూజలు

ప్రజాపక్షం/రంగారెడ్డి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని జిహెచ్‌ఎంసి ప్రాంతాలైన బాలాపూర్,బడంగ్‌పేట్, అల్మాస్‌గూడలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి,పెద్ద బావి సుదర్శన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, నిరుడు శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓటరు జాబితా సవరణ

పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు: ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

ప్రజాపక్షం/రంగారెడ్డి:ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి తెలిపారు. శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు (ఇఆర్ఒలు), సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు (ఎఇఆర్ఒలు), ఎన్నికల విభాగం అధికారులతో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. రంగారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి ఈ సమావేశంలో పాల్గొన్న ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ, జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం చేపడుతున్నట్లు వివరించారు. పెండింగ్‌లో ఉన్న ఫారం6, ఫారం7, ఫారం8 దరఖాస్తులను పరిష్కరించడంతో పాటు, నోటీసుల జారీ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటర్ల నుంచి సేకరించిన ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి రిమాండ్

మహిళను రక్షించిన వ్యక్తికి ఎస్ఐ సన్మానం

ప్రజాపక్షం/కొందుర్గు: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు కొందుర్గు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. శనివారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ వెల్లడించారు. మండల పరిధిలోని చెరుకుపల్లి గ్రామానికి చెందిన ఇప్పలపల్లి మధు (19) అనే యువకుడు 49ఏళ్ల మహిళను తమ ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని ఇంటి వద్ద దింపుతామని చెప్పి జనం లేని ప్రదేశానికి తీసుకువెళ్ళి అఘాయిత్యం చేసేందుకు యత్నించినట్లు తెలిపారు. బాధితురాలు కేకలు వేయడంతో అటునుండి వచ్చిన ఉమర్ అనే వ్యక్తి రక్షించి మహిళను కొందుర్గు పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి ఫిర్యాదు చేయించినట్లు వివరించారు. దాంతో ఈ ఘటనకు పాల్పడిన యువకుడిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఆపదలో ఉన్న మహిళను రక్షించిన ఉమర్‌ను ఎస్ఐ వరప్రసాద్ సన్మానించారు.

వరి పంటలను చేతికొచ్చే వరకు లోవోల్టేజీ లేకుండా విద్యుత్ అందించాలి

రైతుల గోస పట్టించుకోండి సారూ.. బుద్దుల జంగయ్య డిమాండ్

ప్రజాపక్షం/షాద్‌నగర్ :వరి పంటలు చేతికొచ్చే వరకు లోవోల్టేజీ సమస్య లేకుండా విద్యుత్‌ను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. శనివారం ఫరూఖ్‌నగర్ డిప్యూటీ తహసీల్దార్ రాకేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని వివరించారు. కరువు నివారణ చర్యలు చేపట్టడంతో పాటు పేదలందరికి కరువు భత్యం అందించాలని, నిత్యావసర సరుకులను ప్రభుత్వం సరఫరా చేయాలని కోరారు. వ్యవసాయ బోరులో నీరు ఉన్నా.. కరంటు కష్టాలతో వ్యవసాయ పంటలు ఎండుతున్నాయని వాపోయారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. బోరు బావుల్లో నీరు ఉన్నా సమయానికి విద్యుత్ రాక పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. ఒక బోరు నడిస్తే మరో బోరు పని చేయకపోవడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాల వల్ల రైతులు నష్టాలను ఎదుర్కొవడం గ్రామాల్లో సాధారణ సమస్యగా మారిందని పేర్కొంటున్నారు. రైతులు అప్పులు చేసి పంటలను సాగుచేస్తే నీరు అందక కళ్ళముందే ఎండిపోతుంటే వారి బాధ వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సరైన సమయానికి విద్యుత్ అందించకపోతే వ్యవసాయం ఎలా చేయాలని ప్రశ్నించారు. రైతే రాజు అని గొప్పగా ప్రకటనలు చేస్తున్నారే తప్పా ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదని, క్షేత్ర స్థాయిలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతుందని వివరించారు. రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, పంటలు ఎండిపోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, పంటల నష్టాన్ని గుర్తించి నష్టపరిహారం అంధించాలని డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు నష్టపోయిన అన్నదాతలను అదుకోకుంటే ప్రభుత్వంపై పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కెసిఆర్ హయాంలో రైతులకు 24గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించే వారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే విద్యుత్ కోతలు విధిస్తున్నారని వాపోయారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో విద్యుత్ కోతలు విదించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వ్యవసాయ రంగం విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే పంటల దిగుబడిపై తీవ్ర స్థాయిలో ప్రభావం ఏర్పడే అవకాశం ఉందన్నారు. రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం 24గంటల విద్యుత్ సరఫరాను కొనసాగించేందుకు కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి రాజునాయక్, డివిజన్ కాలనీ అధ్యక్షుడు రమేష్ యాదవ్, కోశాధికారి రాములు గౌడ్, ఫరూక్‌నగర్ మండల నాయకులు నాగేష్, ఎం.రాములు, జంగయ్యలు పాల్గొన్నారు.

అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు

ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: అర్హులైన పేదలకు స్మార్ట్ రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎలికట్ట సర్పంచ్ బుద్ద నవకిరణి నరసింహ తెలిపారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో లబ్ధిదారులకు ప్రభుత్వం నుండి వచ్చిన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బుద్ద నవకిరణి నరసింహ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే అర్హులందరికి ఉచితంగా స్మార్ట్ రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని వివరించారు. ఎల్‌నినో, ప్రకృతి వైపరీత్యాలపై గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, తాగునీటిని వృధా చేయకుండా కుళాయిలకు నీటి ట్యాంపులు బిగించుకొని కాపాడుకోవాలని సూచించారు. ప్రకృతి వైఫరీత్యాలు, వాతావరణంలో నెలకొన్న పరిస్థితుల ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని వివరించారు. చేతికొచ్చిన పంటలు ఎండిపోకుండా ఉండేందుకు నిరంతర విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నామని, నీటిని వృధా పొనివ్వకుండా ఓడిసి పట్టి పంటలను అందించడమే కాకుండా తాగునీరు పొదుపుగా ఉపయోగించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీపివో నిర్మలమ్మ, ఉప సర్పంచ్ అభినవ్, వార్డు సభ్యులు గడ్డమీది శ్రీను, పురుగుల సురేష్, మంగళి శ్రీశైలం, పిట్టల కలమ్మ భువనేష్, ముత్యాల కవిత, నింగోల్ల అరుణమ్మ, గోనెల రాము, అంగన్‌వాడి టీచర్ రోజమ్మలు పాల్గొన్నారు.

సంక్షోభం నుండి వ్యవసాయ రంగాన్ని గట్టెక్కించాలన్నదే లక్ష్యం

- తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్
- రైతులకు విద్యుత్ సకాలంలో ఇవ్వకుంటే ఉద్యోగాలు తొలగిస్తాం

ప్రజాపక్షం/షాద్‌నగర్ : వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుండి గట్టెక్కించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ వివరించారు. శనివారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ డివిజన్‌లో 40వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, వీటికి సుమారుగా 112 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉందని తెలిపారు. వ్యవసాయ రంగంలో చేతికొచ్చిన పంటలను రక్షించేందుకు డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారుల నుండి మొదలుకొని విద్యుత్, రెవిన్యూ శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ ప్రస్తుతం అందిస్తున్న విద్యుత్ కంటే అదనంగా మూడు గంటలు ఎక్కువగా ఇచ్చేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలాలు తగ్గిన విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం లేకుండా సరఫరా చేయాలని పేర్కొన్నారు. ఎల్‌నినో కారణంగా విద్యుత్ రంగానికి భారం పడుతున్న రైతు శ్రేయస్సు కోసం చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రైతులకు సకాలంలో విద్యుత్ అందించకుంటే ఉద్యోగాలను తొలగించే పరిస్థితులు వస్తాయని, ఆ పరిస్థితులను తెచ్చుకోవద్దని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మెన్ అందె మోహన్, మండల పార్టీల అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్, పురుషోత్తంరెడ్డి, శేఖర్‌రెడ్డి, కుమారస్వామి గౌడ్, రమేష్, జాకారం శేఖర్, మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, ఆర్‌డిఒ సరిత, తహశీల్దార్ నాగయ్యతోపాటు వివిధ మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

అమ్మవారి అనుగ్ర

కీసర సిఐపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు

రూ.2.28 కోట్ల అక్రమాస్తులు ఉన్నట్లు ఎసిబి అంచనా..

ఇళ్లు, భూములు, నగదు, బంగారం గుర్తింపు

ప్రజాపక్షం/హైదరాబాద్: అవినీతి ఆరోపణలతో ఇప్పటికే లంచం కేసులో అరెస్టయి జైలులో ఉన్న కీసర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అర్కపల్లి ఆంజనేయులుపై తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) మరో కేసు నమోదు చేసింది. ఆయన ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించిన అధికారులు శనివారం ఆయన నివాసం, కార్యాలయంతో పాటు బంధువులు, అనుచరులు, బినామీలకు సంబంధించిన మరో నాలుగు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ప్రాథమిక అంచనా ప్రకారం ఆయన మొత్తం ఆస్తుల విలువ రూ.2.28 కోట్లుగా ఎసిబి వెల్లడించింది. ఎసిబి సిటీ రేంజ్1 అధికారులు నిర్వహించిన సోదాల్లో పలు స్థిర, చరాస్తులకు సంబంధించిన పత్రాలు, నగదు, బంగారు ఆభరణాలు గుర్తించారు. సరూర్‌నగర్ లింగోజిగూడలో పాత ఇంటితో కూడిన రెండు స్థలాలు, ఎల్‌బినగర్ మన్సూరాబాద్‌లోని సిఆర్ ఎన్‌క్లేవ్‌లో పాత ఇల్లు, పెరూరు గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇల్లు, మిర్యాలగూడ పరిధిలోని హాలియాలో వ్యవసాయ భూములు ఉన్నట్లు గుర్తించారు. వీటి అధికారిక విలువ ప్రకారం లింగోజిగూడలోని రెండు స్థలాలు రూ.30 లక్షలు, మన్సూరాబాద్‌లోని ఇల్లు రూ.40 లక్షలు, పెరూరులో నిర్మాణంలో ఉన్న ఇల్లు రూ.50 లక్షలు, హాలియాలోని రెండు ఎకరాల వ్యవసాయ భూమి రూ.80 లక్షలుగా అంచనా వేశారు. విచారణలో మరికొంత వ్యవసాయ భూమిని కూడా ఆయన కొనుగోలు చేసినట్లు సమాచారం లభించిందని ఎసిబి తెలిపింది. ఈ ఆస్తుల మార్కెట్ విలువ అధికారిక అంచనాల కంటే ఎక్కువగా ఉండవచ్చని పేర్కొంది. సోదాల్లో రూ.7 లక్షల నగదు, సుమారు రూ.5 లక్షల విలువైన 60 తులాల బంగారు ఆభరణాలు, రూ.6.50 లక్షల విలువైన మారుతి విటారా బ్రెజ్జా కారు, సుమారు రూ.10 లక్షల విలువైన గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులను గుర్తించారు. అదనపు ఆస్తుల వివరాలపై అధికారులు ఇంకా పరిశీలన కొనసాగిస్తున్నారు.

ఇప్పటికే లంచం కేసులో అరెస్టు..

కాగా, ఇదే ఇన్‌స్పెక్టర్ సెప్టెంబర్ 16న కీసర పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో అధికారిక పని చేసేందుకు రూ.8 లక్షలు లంచం డిమాండ్ చేసి, తన కింద పనిచేసే ఎస్‌ఐ డి.జ్ఞానేందర్ రెడ్డి ద్వారా రూ.5 లక్షలు స్వీకరిస్తూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఈ కేసులో సెప్టెంబర్ 17న ఆయనను అరెస్టు చేసి ఎసిబి కోర్టులో హాజరుపరిచారు. ప్రస్తుతం చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో ఉన్న ఆయనను తాజా అక్రమాస్తుల కేసులో పీటీ వారెంట్‌పై కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎసిబి తెలిపింది. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయండి..

ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల పేర్లు, వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

ఆర్‌టిసి బస్సు కింద నలిగి డెలివరీ బాయ్ దుర్మరణం

ప్రజాపక్షం/జవహర్‌నగర్ : జవహర్‌నగర్ అంబేద్కర్ నగర్ ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. జియోమార్ట్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న యువకుడిని ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. జవహర్ నగర్ ఎస్‌హెచ్‌ఓ సైదులు, వెల్లడించిన వివరాల ప్రకారం జవహర్‌నగర్ అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన గంధమల్ల స్వామి (32) జియోమార్ట్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం స్వామి తన యాక్టివాపై అంబేద్కర్ నగర్ సమీపంలోని రోజు గార్డెన్ వద్ద డెలివరీ పూర్తి చేసుకుని దమ్మాయిగూడ వైపు బయలుదేరాడు. అదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న ఆర్టీసీ బస్సు (టీఎస్ 08జెడ్ 0171) డ్రైవర్ అత్యంత నిరక్ష్యంగా, అతివేగంగా బస్సును నడుపుతూ ఓవర్‌టేక్ చేసే క్రమంలో స్వామి వెళ్తున్న స్కూటీ కుడి వైపున బస్సుతో ఢీకొట్టాడు. దీంతో స్వామి కిందపడిపోగా, బస్సు వెనుక చక్రం ఆయన తలపై నుంచి దూసుకెళ్లింది. ఈ ఘోర ప్రమాదంలో స్వామి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుని తల్లి గంధమల్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిరక్ష్యపు డ్రైవింగే ప్రమాదానికి కారణమని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఒక్కసారిగా జరిగిన ఈ ప్రమాదంతో మృతుని కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

'అనురాగ్'లో బతుకమ్మ జోష్

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘట్‌కేసర్ సర్కిల్‌లోని పోచారం డివిజన్ పరిధిలో అనురాగ్ విశ్వవిద్యాలయంలో సీఈఓ నీలిమా ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. సంప్రదాయాలు ఉట్టిపడేలా జరిగిన ఈ వేడుకలు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పండుగ శోభను నింపాయి. ఈ వేడుకల్లో మహిళా అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో అందంగా ముస్తాబై ఉత్సాహంగా పాల్గొన్నారు. సీఈఓ ఉపకులపతి మొదలుకొని సహాయక సిబ్బంది వరకు అందరూ విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడటం వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలించింది. సంస్కృతీ సంప్రదాయాల గొప్పతనాన్ని చాటుతూ సాగిన ఈ బతుకమ్మ సంబరాలు అనురాగ్ కుటుంబ సభ్యుల్లో ఆనందోత్సాహాలను నింపాయి.

ఎంఎల్ఆర్ఐటిఎంలో ఘనంగా రంగ్‌తారీ 2కె 26

ప్రజాపక్షం/దుండిగల్ : మల్లారి లక్ష్మణ్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌లో రంగ్‌తారీ 2కే 26 ట్రెడిషనల్ డే వేడుకలను కళాశాల ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో అత్యంత వైభవంగా, ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఆర్ ఐటీఎం ప్రిన్సిపాల్ డా.పి.శ్రీధర్ మాట్లాడుతూ, భారతదేశపు గొప్ప బలం భిన్నత్వంలో ఏకత్వమని, దేశంలోని విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ మల్లారి లక్ష్మణ్‌రెడ్డి, ఎంఎల్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫౌండర్ సెక్రటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మల్లారి రాజశేఖర్ రెడ్డి మల్లారి మమతా రెడ్డి, (ట్రెజరర్), మల్లారి శ్రేయా రెడ్డి (సెక్రటరీ), మల్లారి ధీరేన్ రెడ్డి, ఎంఎల్ఆర్ఐపీ ప్రిన్సిపాల్ డా.అరుణాభ మల్లిక్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలు

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : ప్రకృతి ఆరాధన, సామాజిక ఐక్యతను ప్రేరేపించే బతుకమ్మ సంబురాలను జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా రెవెన్యూ, వైద్యారోగ్య, పౌర సరఫరాలు, రెవెన్యూ, భూగర్భ జల శాఖలకు చెందిన మహిళా ఉద్యోగినులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

పూలనే దేవతగా పూజించే బతుకమ్మ

కలెక్టర్ దీపక్‌తివారి

ప్రజాపక్షం/వికారాబాద్ : కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్‌పి స్నేహ మెహ్రా, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతిలో లభించే పూలను దేవతగా పూజించే తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ అని తెలంగాణ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంతరావు, జయసుద ,తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీ

ప్రజాపక్షం/పూడూర్ : పరిగి నియోజకవర్గంలోని పూడూర్ మండల పరిధిలోని చంగోముల్ పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్‌పి స్నేహ మెహ్రా సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌పి పోలీస్ స్టేషన్ పరిసరాలు, లాక్‌అప్, రైటర్స్ రూమ్‌తో పాటు వివిధ విభాగాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిశుభ్రత, క్రమశిక్షణ, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధుల నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిశీలించి, స్టేషన్ నిర్వహణలో నిర్దేశిత ప్రమాణాలను పాటించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులను, పెండింగ్ కేసుల ఫైళ్లు, దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పరిగి సిఐ కొండల్‌రెడ్డి, ఎస్‌ఐ భరత్‌కుమార్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వసతులు కల్పించడానికి కృషి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

ప్రజాపక్షం/శామీర్‌పేట : మూడుచింతలపల్లి పట్టణ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించుటకు కృషి చేస్తానని మేడ్చల్ ఎంఎల్ఏ చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని మూడు చింతలపల్లి, కేశవరం, కొల్తూర్, జగ్గంగూడ, ఆద్రాస్‌పల్లి, పొన్నాల్ గ్రామాల్లో రూ.37.50 లక్షలతో మంచినీటి పైప్‌లైన్, భూగర్భ డ్రైనేజి, సిసి రోడ్డు పనులకు చైర్మన్ జాము రవితో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని ప్రజలకు అవసరమైన మౌళిక వసతులను దశల వారిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మోర్సు బాయి శశిరేఖ, కౌన్సిలర్లు నీరజ్‌గౌడ్, రమేష్, జ్యోతి, మహేశ్వరి, స్వప్న, మాధవి, అజయ్‌కుమార్, పులి ప్రభాకర్, రాజు, మౌనిక, డిఇ స్వాతి, నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (ఎస్ బిఐ) సిఎస్ఆర్ నిధులతో ఐజిఎఫ్ ఇండియా ఆధ్వర్యంలో 20 వేల మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిదిగా మేడ్చల్ ఎంఎల్ఏ చామకూర మల్లారెడ్డి, చైర్మన్ జాము రవిలు విచ్చేసి మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ మోర్సుబాయి శశిరేఖ, కౌన్సిలర్లు నీరజ్‌గౌడ్, ఆది అజయ్ కుమార్, రాజు, రమేష్, నాయకులు మల్లేష్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, యాదగిరి, సంతోష్‌రెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నిరంతర పర్యవేక్షణ, సమన్వయంతో రోడ్డు ప్రమాదాలు తగ్గుదల

జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : నిరంతర పర్యవేక్షణ, సమన్వయంతో కూడిన చర్యల ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో రోడ్డు భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయటం, రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించటం ద్వారా సురక్షిత ప్రయాణాలను కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యల విషయమై ఈ సమావేశంలో చర్చించారు. గత సమావేశంలో తీసుకొన్న నిర్ణయాలపై ఏ మేరకు చర్యలు తీసుసకొన్నారన్న విషయాన్ని సమీక్షించుకొని లోపాలను సరిదిద్దుకొని మరింత పటిష్టవంతంగా, సమర్థవంతంగా ముందుకు వెళ్లేందుకు సిద్ధం కావాలని సూచించారు. రోడ్డు భద్రతా సమస్యలపై సంబంధిత ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ట్రాఫిక్ నియమాలను ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించాలని, ప్రమాదాలు తరచు చోటు చేసుకొనే ప్రాంతాలను గుర్తించి అక్కడ అదనపు చర్యలు తీసుకొనేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోలీసు, రవాణా, రోడ్లు మరియు భవనాలు, పంచాయతిరాజ్, మున్సిపల్ పరిపాలన,జాతీయ రహదారుల శాఖాధికారులతో పాటు జిల్లా రోడ్డు భద్రతా కమిటి సభ్యులు జైపాల్‌రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

త్వరలోనే పెద్దేముల్ ఎఫ్ఎసిఎస్‌ను పిఎసిఎస్‌గా మారుస్తా

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

ప్రజాపక్షం/తాండూరు : త్వరలోనే పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘాన్ని(ఎఫ్ఎసిఎస్) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంగా(పిఎసిఎస్) అఫ్‌గ్రేడ్ చేసి తీరుతానని తాండూరు ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. శనివారం పెద్దేముల్ మండల కేంద్రంలో జరిగిన రైతు సేవా సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎంఎల్ఏ ముఖ్యఅతిథిగా హాజరైనారు. ముందుగా పెద్దేముల్ ఎఫ్ఎసిఎస్ చైర్మన్‌గా నల్ల ఎల్లారెడ్డి, వైస్ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు పాలవర్గ సభ్యులను ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి ఇబ్బందులను త్వరలోనే తీర్చేందుకు ఎఫ్ఎసిఎస్ నుండి పిఎసిఎస్‌గా అప్‌గ్రేడ్ చేసి రైతులకు మరింత మేలు చేకూరుస్తానని హామీ ఇచ్చారు. దీంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. పెద్దేముల్‌లో డిసిసిబి బ్యాంక్ శాఖను ఏర్పాటు చేయడంతో పాటు దీర్ఘకాలిక రుణాలు, ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన రుణాలను అందజేసెందుకు కృసి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ధారాసింగ్ నాయక్, తట్టేపల్లి పిఎసిఎస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, వైస్ చైర్మన్ జగన్, కోట్‌పల్లి మార్కెట్ కమిటి చైర్‌పర్సన్, వైస్ చైర్ పర్సన్‌లు అనిత, మధులతచారి, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ అంజయ్య, బుజ్జమ్మ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కరణం పురుషోత్తమ్‌రావు, నారాయణరెడ్డి, ఉత్తమ్‌చంద్, ఉప్పరి మల్లేశం, శోభ రాణి, లొంక నర్సిములు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు గోపాల్, సర్దార్ ఖాన్, రియాజ్, డివై నర్సిములు రైతులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కృషి

ప్రజాపక్షం/శామీర్‌పేట : పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని అలియాబాద్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. శనివారం అలియాబాద్ మున్సిపాలిటిలోని 81 మంది పారిశుద్ధ్య కార్మికులకు షూస్, నూతన దుస్తులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య సిబ్బంది కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. మున్సిపల్ కార్మికుల సేవలు గుర్తించి దసరా పండగ సందర్భంగా వారికి అవసరమైన షూస్, నూతన దుస్తులను పంపిణి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకట్‌రెడ్డి, శానీటరి ఇన్స్‌పెక్టర్, మేనెజర్ వేణుగోపాల్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అలియాబాద్‌లో ఘనంగా బతుకమ్మ పండగ వేడుకలు

అలియాబాద్ మున్సిపాలిటిలో చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండగను పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆట పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమానికి మాజి డిసిసి హరివర్ధన్‌రెడ్డి, మాజి జడ్పి చైర్మన్ పట్నం సునీత మహేందర్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కోమలత, మున్సిపల్ వైస్ చైర్మన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొని సంప్రదాయ బద్దంగా బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతు బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు

ప్రజాపక్షం/కూకట్‌పల్లి : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కూకట్‌పల్లి గ్రామంలోని రామాలయం, కెపిహెచ్‌బి 9వ ఫేజ్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను శనివారం పిసిసి సభ్యులు, టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం సందర్శించారు. ఈ సందర్భంగా దుర్గా మాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కావేటి నాగార్జున, రాజేష్ శంకర్‌గౌడ్, అరవిందర్‌రెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్‌పుత్, కొండల్ రెడ్డి, మల్లి యాదవ్, చైతన్య యాదవ్, అంజిరెడ్డి, పవన్, భార్గవ్ పాల్గొన్నారు.

కార్మికులకు రూ.10 వేల బోనస్, కుక్కర్లు అందజేత

ప్రజాపక్షం/చర్లపల్లి : చర్లపలి పారిశ్రామివాడలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, ఉద్యోగుల సంక్షేమానికి ఐలా ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఐలా చైర్మన్ గోవింద్‌రెడ్డి తెలిపారు. గతంలో ఎప్పుడు లేని విధంగా పారిశ్రామికవేత్తల సొంత నిధులతో ఐలా పారిశుద్ధ్య కార్మికులకు తొలిసారిగా రూ.10 వేల బోనస్, ఎలక్ట్రిక్ కుక్కర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐలా ఉపాధ్యక్షులు తాటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాఘవయ్య, సంయుక్త కార్యదర్శి సురేష్, కోశాధికారి మల్లిఖార్జున్‌రెడ్డి, శ్రీనివాసరాజు, రాము, నర్సింహరాజు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

నవజీవన్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం

ప్రజాపక్షం/కూకట్‌పల్లి : ప్రజల ఆరోగ్య పరిరక్షణే సమాజానికి నిజమైన సంపద అని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ బండి రమేష్ పేర్కొన్నారు. బాలానగర్ డివిజన్ పరిధిలోని నవజీవన్ నగర్‌లో పాస్టర్ క్రిస్టఫర్, సులోచన ఆధ్వర్యంలో హెల్త్ ఈజ్ ఏ బ్లెస్సింగ్ అనే నినాదంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ సిరిసిల్లా రాజన్నతో పాటు బండి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ సేవా కార్యక్రమాలను నిర్వహించిన పాస్టర్ క్రిస్టఫర్, సులోచనలను బండి రమేష్ అభినందించారు.ఈ కార్యక్రమంలో పుష్పారెడ్డి, లక్ష్మయ్య, పులి శివకుమార్‌గౌడ్, శ్రీకాంత్ పటేల్, మధు మోహన్, జిల్లా శివ, జావిద్, రేణుక, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్షుడు రాజును సన్మానించిన ఎంపి ఈటల

ప్రజాపక్షం/చర్లపల్లి : కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ బిజెపి పార్టీ అధ్యక్షులుగా నియమితులైన కొక్కొండ రాజును మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ సన్మానించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం

Telugu National Daily

ప్రజాపక్షం

Telugu National Daily

ప్రజాపక్షం

Telugu National Daily

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
ఆదివారం
18-10-2026
www.prajapaksham.in

ఇండియన్ సినిమాలో యాక్షన్ హీరో అంటే ఇకపై విజయ్ దేవరకొండ గురించే చెప్పుకుంటారని దర్శకుడు సందీప్ రెడ్డి వంగా అన్నారు విజయ్, రశ్మిక జంటగా నటించిన రణబాలి సినిమాను ఆయన వీక్షించారు. ఈ సినిమా చూసిన అనంతరం తన అనుభూతిని సోషల్ మీడియా ద్వారా షేర్ చేశారు.

రీక్

'రియాలిటీ' ఫస్ట్ లుక్ రిలీజ్

'క', 'కెరాంప్' చిత్రాల విజయాల తర్వాత హీరో కిరణ్ అబ్బవరం తాజాగా 'రియాలిటీ' అనే సినిమాతో అలరించనున్నారు. ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు కూడా కిరణ్ అబ్బవరం స్వయంగా చేపట్టడంతో పాటు హీరోగా నటిస్తున్నారు. జాయ్ ఫిలమ్స్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి నిర్మిస్తుండగా, సురేష్ యెర్రా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలో హీరోయిన్ నటిస్తున్న దేవికా భట్‌ను 'ఆలోచన'గా పరిచయం చేస్తూ మేకర్స్ బ్యూటీఫుల్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో దేవికా భట్ అందంగా, సహజమైన చిరునవ్వు తో ఆకట్టుకుంటున్నారు. హీరోతో ఆమె పంచుకుంటున్న ఆత్మీయమైన క్షణాలు, ఇద్దరి మధ్య కనిపిస్తున్న అనుబంధం పోస్టర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. విశ్వాస్ డేనియల్ డీవోపీ, సుధీర్ మాచర్ల ప్రొడక్షన్ డిజైనర్‌గా, సంతోష్ నాయుడు ఎడిటర్‌గా, రాజేష్ కామర్సు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు.'రియాలిటీ' క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న థియేటర్లలో విడుదల కానుంది.

'ఐ హేట్ మ్యారేజ్' టీజర్ విడుదల



సుగి విజయ్, జుప్సీ భద్ర (తొలి పరిచయం) హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'ఐ హేట్ మ్యారేజ్' ఆర్య సినిమా బ్యానర్‌పై మాదం దయానంద్, కార్తిక్ వెంపటి కలిసి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంతో పరమేశ్ రేణుకుంట్ల దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఇటీవల ఈ చిత్రం నుంచి విడుదల చేసిన 'అప్పుడే పెళ్లా' అనే లిరికల్ వీడియోకు అనూహ్యమైన స్పందన వచ్చింది. సోషల్ మీడియాలో ఈ సాంగ్ ట్రెండింగ్‌లో నిలిచింది. కాగా తాజాగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ప్రేమ, పెళ్లి, కెరీర్‌తో పాటు స్వతంత్రంగా జీవించాలనే నేటి జెంజి తరం ఆలోచనలు, భావజాలాన్ని వాస్తవానికి దగ్గరగా చూపించే ప్రయత్నం ఈ చిత్రం.జీవితంలో యువత ఎదుర్కొనే భావోద్వేగాలు, నిర్ణయాలను సహజంగా ఆవిష్కరించే ప్రయత్నం ఈ చిత్రంలో కనిపించనుంది. ప్రతి యువత ఈ సినిమాలో క్యారెక్టర్స్‌తో కనెక్ట్ అవుతారు. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు కొత్త అనుభూతినిచ్చే ఫ్రెష్ కంటెంట్ మా చిత్రంలో వుంది' అన్నారు. హారిక రాజేందర్, సాహితి కృష్ణ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో పృథ్వీరాజ్, రవివర్మ అడ్డూరి,ప్రభావతి, ఆశ్రిత వేముగంటి, లోహిత్ కుమార్,బేబి తమోష్ణు, రాధ రాయసం, లక్ష్మి , జాకీర్, విజయ్ కుమార్, దాసరి పద్మ రేఖ, శ్రీదేవి ఆర్రోజు, మెయిల్ రమేష్, అరుణ్ కుమార్ రెడ్డి, ప్రముఖ నటి ఇందు, తదితరులు ఇతర పాత్రల్లో నటించారు.

'జైలర్ 2'తో డిస్ట్రిబ్యూటర్లకు కమీషన్ వస్తుంది

నిర్మాత సూర్యదేవర నాగవంశీ-పంపిణీదారు శశి

సూపర్ స్టార్ రజనీకాంత్, నెల్సన్ దిలీప్‌కుమార్ కలయికలో రూపొందిన 'జైలర్' చిత్రం 2023లో విడుదలై ఎంతటి సంచలనం సృష్టించిందో తెలిసిందే. ఇప్పుడు ఆ సినిమాకు సీక్వెల్‌గా 'జైలర్ 2' చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమా ఇప్పుడు థియేటర్లలో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పంపిణీ హక్కులను సొంతం చేసుకున్న నిర్మాత సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత సూర్యదేవర నాగవంశీ , ఈ చిత్రాన్ని నైజాంలో విడుదల చేసిన మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ మైత్రి శశి కలసి శనివారం ప్రెస్ మీట్ నిర్వహించారు. సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ 'మేము నిర్మించిన సినిమా అయినా, పంపిణీ చేసిన సినిమా అయినా డిస్ట్రిబ్యూటర్లకు కమీషన్ వస్తే చాలా సంతోషంగా ఉంటుంది. రజనీకాంత్‌ని, నెల్సన్ ని, అనిరుధ్ ని నమ్మి రిస్క్ చేశాము. దానికి ప్రతిఫలం దక్కుతుండటం చాలా సంతోషంగా ఉంది.'జైలర్ 2' రాబోయే రోజుల్లో మరిన్ని భారీ వసూళ్లు సాధించాలని కోరుకుంటున్నాను. అన్నారు.మైత్రి శశి మాట్లాడుతూ 'జైలర్ 2 భారీ వసూళ్లు సాధిస్తుందని ఆశిస్తున్నాము. ప్రతి ఒక్కరూ సినిమా చూసి చాలా బాగా ఎంజాయ్ చేస్తున్నారు. అనిరుధ్ సంగీతం గొప్పగా ఉంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమా నైజాం రైట్స్‌ను మా మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్‌కి ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.

'ఇడుపుకాయితం'తో బ్రేక్ వస్తుంది

'ప్రజాపక్షం' ఇంటర్వ్యూలో సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి



తెలుగు సినిమా రంగంలో దివంగత చక్రి తరువాత ఆ స్థాయికి వచ్చిన తెలంగాణ సంగీత దర్శకుడు ఎవరు లేరనే చెప్పాలి. ఇప్పుడిప్పుడే కొంతమంది ఎదుగుతున్నారు. భీమ్స్ తరువాత తెలంగాణ నుంచి సంగీత దర్శకుడిగా ఎదుగుతున్న మరో మ్యూజిక్ ఆణిముత్యం సురేష్ బొబ్బిలి. చక్రి శిష్యుడిగా సురేష్ బొబ్బిలి సినిమా రంగంలో ఎదుగుతున్నాడు. అయితే ఒక మంచి సక్సెస్ ప్రతి కళాకారుడి జీవితాన్ని మార్చేస్తుంది అంటారు. అలాంటి సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న సంగీత దర్శకుల్లో బొబ్బిలి సురేష్ ఒకరు. రానా నటించిన 'విరాటపర్వం' చిత్రానికి సంగీతం అందించి మంచి పేరు తెచ్చుకున్న సురేష్ బొబ్బిలి తాజాగా స్వరపరచిన 'ఇడుపుకాయితం' సినిమా నుంచి శ్రీలత అనే పాట బాగా వైరల్ అవుతోంది. ఈ సందర్భంగా సురేష్ బొబ్బిలితో 'ప్రజాపక్షం' ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసింది.

ప్రశ్న: సురేష్ ...మీ నేపథ్యం చెప్పండి ?

సురేష్: అన్న....నాది మహబూబాబాద్ జిల్లా, బయ్యారం మండలం, గౌరారం గ్రామం. శంభయ్య, కాంతమ్మ దంపతుల నా తల్లిదండ్రులు. జూన్ 12న నేను పుట్టిన. మా నాన్న స్టేజి ఆర్టిస్టు, అమ్మ పాటలు బాగా పాడేది. అలా నాకు పాటతో చిన్నప్పటి నుంచే అనుబంధం ఏర్పడింది. నేను మ్యూజిక్ డైరెక్టర్ చక్రి ట్రూప్‌లో ఉండేవాడిని. పాటలతో నా ప్రయాణం అలా మొదలైంది. వరంగల్ మ్యూజిక్ కాలేజ్‌లో సంగీతం నేర్చుకున్నా. సౌండ్ ఇంజినీర్‌గా మారాను. ఆ అనుభవంతో మ్యూజిక్ కంపోజర్‌గా ఎదిగాను.

ప్రశ్న : సంగీతంపై ఇంట్రెస్ట్ ఎలా పుట్టింది ?

సురేష్ : చిన్నప్పటి నుంచే నేను పాటలు పాడుతా. కొన్ని సినిమాలకు కూడా పడిన. తెలంగాణ జానపదాలు అంటే చాలా ఇష్టం. సినిమారంగంలో రావాలని కొన్ని రోజులు ఒక రికార్డింగ్ స్టూడియోలో బాయ్ గా పని చేసిన. అక్కడ అన్ని నేర్చుకున్న. సంగీత దర్శకుడిగా బతుకమ్మ పాటలు చేసిన. మీ అందరికి తెలుసు నేను స్వరపరిచిన 'పచ్చ పచ్చని పల్లె' పాటకు, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవానికి స్వరపరిచిన 'జనని' పాటకు ప్రశంసలు అందుకున్నాను.

ప్రశ్న : సంగీత దర్శకుడిగా తొలి ప్రయాణం ఎలా జరిగింది. ?

సురేష్ : తెలుగు చలనచిత్ర సంగీత దర్శకుడు 2017లో వచ్చిన 'మా అబ్బాయి' అనే చిత్రం ద్వారా చిత్రసీమలోకి అడుగు పెట్టాను. ఆ తరువాత వేణు ఊడుగుల దర్శకత్వంలో, సాయి పల్లవి, రానా దగ్గుపాటి నటిస్తూ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర ఫిలిమ్స్, సురేష్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించిన 'విరాట పర్వం' నాకు మంచి పేరు తెచ్చి పెట్టింది. వేణు అడుగుల నాకు అన్న లాంటోడు. అందుకే ఆయన సినిమాలో ఛాన్స్ ఇచ్చాడు. ఈ సినిమా మ్యూజిక్ విని రానా, సురేష్ బాబు కూడా మెచ్చుకున్నారు.

ప్రశ్న: సురేష్ శ్రీలత పాటు ఎలా పుట్టింది? వస్తున్న రెస్పాన్స్ ఎలా ఉంది?

సురేష్: శ్రీలత..' పాట మా ఫ్యామిలీ మెంబర్స్‌కు బాగా నచ్చింది. వాళ్లు ఫోన్స్ చేసి పాట బాగుందని చెబుతున్నారు. ఇండస్ట్రీ నుంచి కూడా మా సాంగ్‌కు రెస్పాన్స్ బాగుంది. పాట కంపోజిషన్, సౌండింగ్, లిరిక్స్ , ఇద్దరు సింగర్స్ పాడిన విధానం తమను ఆకట్టుకుందని చెబుతున్నారు. ఈ పాటలో నేను నటించాను. ఈ ఆలోచన బన్నీ వాస్ ది. మీరు ఇన్ని సాంగ్స్ కు మ్యూజిక్ చేశారు. మీరు ఎవరో ప్రేక్షకులకు తెలియాలి కదా అని ఈ సాంగ్ లో నేను కూడా నటించేలా చేశారు. నేను ప్రజలకు తెలియాలి అనే ఆలోచన నాలో కూడా ఉండేది. అందుకే ఒక ప్రైవేట్ సాంగ్ నేనే పర్ ఫార్మ్ చేస్తూ చేయాలని కూడా అనుకున్నాను. పాటలో నటించడం కొత్త ఎక్సిపీరియన్స్ ఇచ్చింది. ఈ పాటలో నటించడాన్ని ఎంజాయ్ చేశాను. ఈ పాట కోసం డిస్కషన్స్ జరుగుతున్నప్పుడే సినిమాలోని కథలో భాగమవుతూ, ప్రమోషన్ కు కూడా ఉపయోగపడేలా ఉండాలని అనుకున్నాం. పాటలో క్యాచీ లిరిక్స్ కూడా కుదిరాయి. ప్రజలు ఈ పాటను ఓన్ చేసుకునేలా ఉండాలని డిజైన్ చేసి ముందే రిలీజ్ చేశాం. ట్యూన్ పాడుతుంటే లిరిక్ రాశాడు గీత రచయిత అలరాజు. ఈ పాటకు ట్యూన్, లిరిక్స్ ఒకే రోజులో ఫైనల్ అయ్యాయి. పాట అందరికీ రీచ్ అవ్వాలనే కంప్లీట్‌గా తెలంగాణ ఫోక్ స్టైల్‌లో కంపోజ్ చేయలేదు. చరణం మెలోడియస్ గా ఉండేలా ట్యూన్ డిజైన్ చేశాను.

ప్రశ్న: మ్యూజిక్‌కు స్కోప్ ఉన్న చిత్రమా ఇది?

సురేష్: అవును .. ఈ చిత్రంలో ఆరు పాటలతో పాటు కొన్ని బిట్ సాంగ్స్ ఉంటాయి. ఆల్బమ్ మొత్తం బాగా వచ్చింది. నాకు పర్సనల్ గా పాటలన్నీ సంతృప్తినిచ్చాయి. ప్రతి సినిమాకు సంతోషిస్తాం కానీ అందులో సందర్భానికి వచ్చే పాటలు కొన్నే ఉంటాయి. ఈ చిత్రంలో ప్రతి పాట సందర్భానికి తగినట్లు ఉంటుంది. నెక్స్ట్ రిలీజ్ చేయబోయే సాంగ్ కూడా అదిరిపోతుంది. మ్యూజిక్ కు ఎక్కువ స్కోప్ ఉన్న చిత్రమిది. పెళ్లి ఎపిసోడ్ పాట, కొత్త జంట విలేజ్ కు వెళ్లివచ్చేప్పుడు పాట..ఇలా కథలోని సందర్భాలకు మంచి సాంగ్స్ కుదిరాయి. ఇది పూర్తిగా తెలంగాణ నేపథ్య సినిమానే అయితే మ్యూజికల్ గా అందరికీ రీచ్ అయ్యేలా పాటల్లో కమర్షియల్ టచ్ ఇచ్చాం.

ప్రశ్న: ఈ పాట ఎవరు రాశారు ?

సురేష్ : లిరిక్ రైటర్ అలరాజు అన్న డైరెక్టర్ వంశీరెడ్డి అన్నకు ఫ్రెండ నాకు కూడా అలరాజు అన్న తెలుసు. ఆయన సాహిత్యం ఎలా ఉంటుందో ఐడియా ఉంది. ఈ పాటలో తెలంగాణ వారికి వాడుకలో ఉన్న, సుపరిచితమైన కొన్ని పదాలతో పాట రాశాడు. అవి పాటకు అందాన్ని తీసుకురావడమే కాదు త్వరగా అందరికీ రీచ్ అయ్యేలా చేశాయి. ఫ్యామిలీ మెంబర్స్ కూడా పాటకు కనెక్ట్ అయ్యారు. పాట బాగుందని కాల్ చేసిన చెబుతున్నారు. మోహన భోగరాజు, శంకర్ బాబు పాడారు.

ప్రశ్న: సినిమా రంగంలో తెలంగాణ వారి ప్రాధాన్యత పెరుగుతున్నట్టు ఉంది?

సురేష్: మన సినిమాల్లో తెలంగాణ బాణీ పెరగడం చూస్తుంటే సంతోషంగా ఉంది. నేను గతంలో కొన్ని ఛానెల్స్ కోసం తెలంగాణ నేపథ్య సాంగ్స్ కంపోజ్ చేశాను. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పాటలు రూపొందించాను. తెలుగు సినిమాలో తెలంగాణ పాటలతో పాటు తెలంగాణ కళాకారులకు సాంకేతిక నిపుణులకు ప్రాధాన్యత పెరిగింది.

ప్రశ్న: ప్రస్తుతం మీరు చేస్తున్న సినిమాలు ఏంటి?

సురేష్: క్రేజీ కల్యాణం(ఇటీవల రిలీజయింది), దేత్తడి, తెల్లకాగితం, షణ్ముర్ధి వంటి చిత్రాలను మ్యూజిక్ చేస్తున్నా. వీటితో మరికొన్ని సినిమాలకు సంప్రదింపులు జరుగుతున్నాయి.

క్రీడ

ముంబై ఇండియన్స్.. హెడ్ కోచ్ రాజీనామా!

ఐపిఎల్ 2027 సీజన్ మినీ వేలానికి ముందు ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీలో కీలక మార్పు చోటు చేసుకుంది. సుదీర్ఘ కాలం జట్టుకు సేవలందించిన హెడ్ కోచ్ మహేళ జయవర్ధనే తన పదవికి రాజీనామా చేశాడు. ఈ విషయాన్ని ముంబై ఫ్రాంచైజీ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ముంబై ఇండియన్స్ హెడ్ కోచ్ పదవి బాధ్యతల నుంచి మహేళ జయవర్ధనే తప్పుకున్నాడని పేర్కొంది.

ఐపిఎల్ 2017 నుంచి 2022 వరకు ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ హెడ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వహించిన మహేళ జయవర్ధనే.. తర్వాతి రెండేళ్లు ముంబై గ్లోబల్ హెడ్‌గా సేవలందించాడు. తిరిగి ఐపిఎల్ 2025 సీజన్‌లో ముంబై హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన.. ఐపిఎల్ 2027 మినీ వేలానికి ముందు ఆకస్మాత్తుగా తప్పుకున్నాడు. ఐపిఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ ఆశించిన ఫలితాలను సాధించకపోవడంతో మేనేజ్‌మెంటే అతన్ని తప్పించినట్లు తెలుస్తోంది.

జీవితానికి సరిపోయే జ్ఞాపకాలు..

ముంబై హెడ్ కోచ్‌గా పనిచేసిన రోజులు జీవితాంతం గుర్తుకు ఉంటాయని ఈ సందర్భంగా మహేళ జయవర్ధనే తెలిపాడు. '10 ఏళ్లకు పైగా ముంబై ఇండియన్స్‌లో సాగిన ప్రయాణం నా జీవితంలో చాలా ప్రత్యేకమైనది. ప్లేయర్లు, కోచింగ్ టీమ్, అండగా నిలిచి ముంబై కుటుంబం, ముఖ్యంగా అభిమానుల ప్రేమాభిమానాలు.. ఈ అనుభవాన్ని జీవితాంతం గుర్తుండిపోయేలా చేశాయి. మేమంతా కలిసి ఎన్నో మధురమైన క్షణాలను పంచుకున్నాం. అనేక సవాళ్లను ఎదుర్కొని గర్వపడే స్థాయికి జట్టును చేర్చాం. ఇన్నేళ్లుగా నాపై ఎంతో నమ్మకం ఉంచి, మద్దతు తెలిపిన టీమ్ యజమానులకు, అభిమానులకు ధన్యవాదాలు. ఈ ఫ్రాంచైజీకి నా గుండెల్లో ప్రత్యేకమైన స్థానం ఉందని చెబుతూ.. వీడ్కోలు తీసుకుంటున్నాను. రాబోయే రోజుల్లో ఈ జట్టు మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.'అని మహేళ జయవర్ధనే పేర్కొన్నాడు.

మూడు టైటిళ్లు అందించిన జయవర్ధనే

ఐపిఎల్ 2025 సీజన్‌కు ముందు మార్క్ బౌచర్ స్థానంలో జయవర్ధనే హెడ్ కోచ్‌గా తిరిగి బాధ్యతలు చేపట్టాడు. 2022–2024 మధ్య ముంబై గ్లోబల్ హెడ్‌గా ఎంఐ ఎమిరెట్స్, ఎంఐ న్యూయార్క్, ఎంఐ కేప్‌టౌన్ జట్లను పర్యవేక్షించాడు. జయవర్ధనే హయాంలో ముంబై ఇండియన్స్ మూడు టైటిళ్లు గెలిచింది. కానీ రెండోసారి మాత్రం తీవ్రంగా నిరాశపర్చింది. ఐపిఎల్ 2025లో క్వాలిఫయర్2 చేరిన ముంబై.. ఐపిఎల్ 2026 సీజన్‌లో 9వ స్థానంలో నిలిచింది.

మహేళ జయవర్ధనే సేవలను ముంబై ఫ్రాంచైజీ ఓనర్ నీతా అంబానీ ప్రత్యేకంగా కొనియాడారు. ముంబై కుటుంబంలో ఆయన ఎప్పటికీ భాగమేనని స్పష్టం చేశారు. మహేళతో కలిసి చేసిన ప్రయాణాన్ని మరిచిపోమని, ఆయన భవిష్యత్తు మరింత బాగుండాలని ఆకాంక్షించారు. జయవర్ధనే రాజీనామాతో ముంబైకి కొత్త కోచ్‌ను నియమించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రిటెన్షన్ ప్రక్రియకు నవంబర్ 15నే గడువు కాగా.. ఆలోపు కొత్త కోచ్‌ను ఎంపిక చేసే అవకాశం ఉంది. ముంబై ఇండియన్స్ చివరిసారిగా ఐపిఎల్ 2020 సీజన్‌లో విజేతగా నిలిచింది.

ఆమె వల్లే ఓడిపోయే మ్యాచ్‌లో గెలిచాం

స్మృతి మంధాన

దీప్తి శర్మ అద్భుతమైన బ్యాటింగ్‌తోనే ఓడిపోయే మ్యాచ్‌లో విజయం సాధించామని టీమిండియా కెప్టెన్ స్మృతి మంధాన తెలిపింది. అరంగేట్ర ప్లేయర్ నికీ ప్రసాద్ కూడా అద్భుతంగా ఆడిందని కొనియాడింది. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా రాయ్‌పూర్ వేదికగా శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన టీమిండియా 4 వికెట్ల తేడాతో జింబాబ్వేను ఓడించింది.

ఈ గెలుపుతో స్మృతి మంధాన తన కెప్టెన్సీ ప్రయాణాన్ని ఘనంగా మొదలుపెట్టింది. ఇటీవలే టీమిండియా పూర్తి స్థాయి కెప్టెన్‌గా మంధాన ఎంపికైన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన స్మృతి మంధాన కెప్టెన్‌గా డ్రెస్సింగ్ రూమ్‌లో తాను చెప్పిన రెండు ముఖ్యమైన విషయాలు ఏంటని చెప్పేందుకు నిరాకరించింది. నందిని శర్మ అద్భుతంగా బౌలింగ్ చేసిందని కొనియాడింది.

ప్రణాళికలకు తగ్గట్లు ఆడలేదు..

'మా ప్రణాళికలకు తగ్గట్లు ఆడలేదు. కానీ విజయం సాధించాం. ఈ రోజు మా ప్లేయర్లలో కొంత మంది ప్రదర్శన గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. నందిని శర్మ అద్భుతంగా బౌలింగ్ చేసింది. తన తొలి మ్యాచ్‌లోనే నికీ ప్రసాద్ అదరగొట్టింది. దీప్తి శర్మ తనకు అలవాటైన రీతిలోనే ఆడింది. ఆమె నిజంగా ఓ దిగ్గజం. ఈ మ్యాచ్ గెలిచినందుకు చాలా సంతోషంగా ఉంది. కానీ ఒక జట్టుగా మేం సరిదిద్దుకోవాల్సిన లోపాలు, నేర్చుకోవాల్సిన విషయాలు చాలానే ఉన్నాయి. కెప్టెన్‌గా డ్రెస్సింగ్ రూమ్‌లో నేను చెప్పాల్సిన విషయాలు చెప్పాను. వాటిపై పనిచేయడం మొదలు పెట్టాక త్వరలోనే మీకు ఫలితాలు కనిపిస్తాయి. ఆ విషయాలు ఏంటని ఇప్పుడు చెప్పలేను. కానీ వాటిపై మేం బాగా చర్చించాం. ఈ మ్యాచ్‌లో మా సానుకూల అంశాలు ఏంటంటే.. మైదానంలో ఫీల్డింగ్ ఇంటెన్సిటీ చాలా బాగుంది. ముఖ్యంగా వికెట్ల కోసం మా ఫీల్డర్లు డైవ్స్ కూడా చేశారు.

జింబాబ్వే బాగా ఆడింది..

ఈ మ్యాచ్‌లో జింబాబ్వే అద్భుతంగా ఆడింది. ముఖ్యంగా వారి బ్యాటర్లు చక్కని షాట్స్ ఆడారు. ఎప్పుడూ ఆడని కొత్త టీమ్‌తో మ్యాచ్ అంటే కాస్త కష్టంగానే ఉంటుంది. ఎందుకంటే వాళ్లు ఎలా ఆడతారో అంచనా వేయలేం. కానీ మ్యాచ్ చివర్లో మా బౌలర్లు పుంజుకొని పిచ్‌కు తగ్గట్లు బౌలింగ్ చేయడం కలిసొచ్చింది. మ్యాచ్‌కి ముందే మేం వాళ్ల గురించి ప్రణాళికలు రచించాం. కానీ వీడియోల్లో, మైదానంలోని వారి ఆట చాలా తేడాగా ఉంది. దీప్తి శర్మ అద్భుతంగా బ్యాటింగ్ చేసింది. బౌలర్లను ఏ మాత్రం సెటిల్ అవ్వనివ్వలేదు. చాలా ధైర్యంగా బ్యాటింగ్ చేసింది. ఆమె బ్యాటింగ్ చూసాక నా ఆత్మవిశ్వాసం కూడా రెట్టింపు అయ్యింది.'అని స్మృతి మంధాన చెప్పుకొచ్చింది.

ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్ కోచ్‌గా చామిందా వాస్

న్యూఢిల్లీ: శ్రీలంక మాజీ బౌలర్ చామిందా వాస్ మళ్లీ రంగంలోకి దిగుతున్నారు. ఈ సారి బౌలింగ్ కోచ్ రూపం దరించనున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. రాబోయే ఐపిఎల్ సీజన్ కోసం డిసి జట్టు పూర్తిగా ప్రిపేరవుతోంది. శ్రీలంక జాతీయ జట్టులో అత్యుత్తమ కెరీర్ కలిగిన బౌలర్‌గా వాస్‌కు పేరున్నది. 111 టెస్టుల్లో 355, వన్డేల్లో 400 వికెట్లు తీశాడతను. గత రెండు సీజన్‌ల నుంచి ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు మునాఫ్ పటేల్ బౌలింగ్ కోచ్‌గా ఉన్నాడు. అయితే మునాఫ్ స్థానంలో వాస్ రానున్నాడు. వరల్డ్ కప్ విన్నర్, శ్రీలంక బెస్ట్ బౌలర్.. వెల్కమ్ టు టైగర్ టెరిటరీ అని డిసి తన ఎక్స్‌లో పోస్టు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ప్రధాన కోచ్‌గా సౌరవ్ గంగూలీ, బ్యాటింగ్, అసిస్టెంట్ కోచ్‌గా యువరాజ్ సింగ్ కూడా బాధ్యతలు నిర్వర్తించనున్న విషయం తెలిసిందే. డీసీ జట్టు ఇప్పటి వరకు ఐపిఎల్ టైటిల్ గెలవలేదు, 2020 సీజన్‌లో మాత్రం ఆ జట్టు ఫైన్ చేరింది. జిఎంఆర్ గ్రూపు, జెఎస్‌డబ్ల్యూ గ్రూపు ఆ జట్టు ఓనర్లుగా ఉన్నారు.

భారత్–వెస్టిండీస్ ఆఖరి టీ20 రద్దు

ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా భారత్–వెస్టిండీస్ ఆఖరి టీ20 వర్షం కారణంగా రద్దయ్యింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా శనివారం జరగాల్సిన ఈ మ్యాచ్ 7.4 ఓవర్ల ఆటతోనే తుడిచిపెట్టుకుపోయింది. వర్షం కాస్త గ్యాప్ ఇవ్వడంతో అంపైర్లు ఈ మ్యాచ్‌ను 9 ఓవర్లకు కుదించారు. కానీ వర్షం మరోసారి అంతరాయం కలిగించడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ వర్షం అంతరాయం కలిగించే సమయానికి 7.4 ఓవర్లలో 5 వికెట్లకు 118 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్(10 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 30) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగగా.. శ్రేయస్ అయ్యర్(14 బంతుల్లో 2 ఫోర్లతో 22), నమన్ ధీర్(6 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 24 నాటౌట్) దూకుడుగా ఆడారు. వెస్టిండీస్ బౌలర్లలో కీమో పాల్, షమార్ స్ప్రింగర్ రెండేసి వికెట్లు తీయగా.. షమార్ జోసెఫ్ ఒక వికెట్ పడగొట్టాడు.

ఇషాన్ కిషన్ ఊచకోత..

భారత్ ఇన్నింగ్స్‌ను అభిషేక్ శర్మ భారీ సిక్సర్‌తో మొదలుపెట్టాడు. కానీ అదే జోరులో అతను క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ వరుసగా 6, 2, 4, 6, 4, 1 బాది ఒకే ఓవర్‌లో 24 పరుగులు పిండుకున్నాడు. అనంతరం మరో బౌండరీ బాదిన ఇషాన్ కిషన్ అదే జోరులో షమార్ జోసెఫ్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఇషాన్ ఔటైనా సంజూ శాంసన్ 4, 6 బాదడంతో భారత్ 3 ఓవర్లలోనే 2 వికెట్లకు 56 పరుగులు చేసింది.

సంజూ ఔటవ్వగా.. శ్రేయస్ అయ్యర్ దూకుడుగా ఆడే ప్రయత్నం చేశాడు. వరుసగా రెండు బౌండరీలు బాదిన అతను కీమో పాల్ బౌలింగ్‌లో క్యాచ్ ఔటయ్యాడు. ఆ తర్వాత నమన్ ధీర్ తన బ్యాట్‌ను ఝుళిపించాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. తిలక్ వర్మ(7) ఔటవ్వగానే.. వర్షం అంతరాయం కలిగించింది. వర్షం తగ్గే సూచనలు కనిపించకపోవడంతో అంపైర్లు ఆటను రద్దు చేశారు. సిరీస్ డిసైడర్ అయిన ఈ మ్యాచ్ రద్దవ్వడంతో ఐదు టీ20ల సిరీస్‌ను ఇరు జట్లు పంచుకున్నాయి. మ్యాచ్ రద్దవ్వడం వెస్టిండీస్‌కు కలిసొచ్చింది. 9 ఓవర్ల మ్యాచ్ పూర్తిగా జరిగి ఉంటే భారత్ గెలిచేది.

షమీకి ప్రాధాన్యతనివ్వడం లేదు

మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్

టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ షమీకి సెలెక్టర్లు ప్రాధాన్యత ఇవ్వడం లేదనే విషయం మరోసారి స్పష్టమైందని మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు. అయితే అతనికి ఇంకా టీమిండియా డోర్లు మూసుకుపోలేదని చెప్పాడు. న్యూజిలాండ పర్యటనకు ఎంపిక చేసిన భారత టెస్ట్, వన్డే జట్లలో మహమ్మద్ షమీకి అవకాశం దక్కలేదు. ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో చివరిసారిగా ఆడిన షమీ మళ్లీ భారత జట్టు తరఫున బరిలోకి దిగలేదు. గాయం నుంచి కోలుకొని దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్నా సెలెక్టర్లు పట్టించుకోవడం లేదు. తాజాగా ఈ విషయంపై మాట్లాడిన అశ్విన్.. అవకాశం కోసం షమీ వేచి చూడాల్సిందేనని అభిప్రాయపడ్డాడు. 'మహమ్మద్ షమీ ఫిట్‌గా ఉండి రాణించినంత కాలం అతనికి డోర్లు తెరిచే ఉంటాయని నేను భావిస్తున్నా. అయితే న్యూజిలాండ్ పర్యటనకు ఎంపికైన ఆటగాళ్లు కూడా బాగా రాణించారు. ప్రసిధ్ కృష్ణ, ఆకాష్ దీప్ అద్భుతంగా బౌలింగ్ చేశారు. కాబట్టి న్యూజిలాండ పర్యటనకు ఎంపికైన వారంతా అర్హులే. మహమ్మద్ షమీ తన అవకాశం కోసం వేచి చూడాలి. అతనికి

ప్రజాసమస్యలపై బిఆర్ఎస్ పోరాటం

ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్: ప్రజా సమస్యలపై బిఆర్ఎస్ పోరాటం చేస్తుందని గోషామహల్ బిఆర్ఎస్ ఇంచార్జి ఆర్‌వి మహేందర్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు దత్తాత్రేయనగర్ డివిజన్ పరిధిలోని నటరాజ్ నగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి మహేందర్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈశ్వర్, లక్ష్మణ్, ప్రదీప్, జాకర్ చారి, నవీన్, కవిత, జ్యోతి, భరత్, శేషురావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల ఆందోళన

టిజిపిఎస్‌సి వద్ద ఉద్రిక్తత

ప్రజాపక్షం/గోషామహల్: గడచిన పది రోజులుగా పరీక్ష వాయిదా వేయాలని టిజిపిఎస్‌సి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని, పరీక్ష తేదీలు మార్చాలని నిరుద్యోగులు ఆందోళనకు దిగారు. వేసిందే తక్కువ పోస్టులు.. ఆపై పరీక్ష వాయిదా వేయమంటే పట్టించుకోవడం లేదని నిరుద్యోగులు మండిపడ్డారు. 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తాం.. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం.. అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్.. ఏ ఒక్క హామీని నెరవర్చలేదని నిరుద్యోగులు ఆరోపించారు. సివిల్ ఇంజనీరింగ్ చేసిన నిరుద్యోగులకు ఆర్ అండ్ బి ఎఇఇ పరీక్ష, ఎస్ఎస్‌సి జెఇ పరీక్ష రెండూ నవంబర్ 6వ తేదీనే ఉన్నాయని, ఎఇఇ పరీక్ష వాయిదా వేయాలని వారు డిమాండ్ చేశారు.

సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

ప్రజాపక్షం/వెంగళరావునగర్: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను మధురానగర్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డి బ్లాక్ పార్కు వద్ద నిర్వహించిన ఈ వేడుకలకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఆయన సతీమణి వర్షా యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవిరెడ్డి నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వెంగళరావునగర్, మధురానగర్, సిద్ధార్థనగర్ కాలనీలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఛత్రినాక సిఐకి సన్మానం

ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట: నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి పోలీసులు పనిచేస్తున్నారని నిర్వాహకులు కొనియాడారు. ఈ మేరకు కందికల్ విలేజ్ బజరంగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛత్రినాక సిఐ కోటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. నవరాత్రి ఉత్సవాల్లో పటిష్టమైన భద్రత సౌండ్ పొల్యూషన్ డిజే పగడ్బందీగా అమలు చేసినందుకు కాంగ్రెస్ నాయకులు డిఎల్ నర్సింగ్‌గౌడ్, బద్రీనాథ్, సతీష్ గౌడ్, ఇమ్రాన్ ఖాన్, మంజుల గౌడ్ పోలీసులను ఘనంగా సన్మానించారు

దాండియా వేడుకలు

ప్రజాపక్షం/తార్నాక: లఖోటియా కాలేజ్ ఆఫ్ డిజైన్ తార్నాక బ్రాంచ్‌లో నవరాత్రి వేడుకలు అత్యంత ఉత్సాహభరితమైన వాతావరణంలో జరిగాయి. సాంప్రదాయ దుస్తులు, సంగీతం, నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో విద్యార్థులు, అధ్యాపకులు ఈ సాయంత్రాన్ని ఘనంగా జరుపుకున్నారు.ఈ ఈవెంట్లో విద్యార్థులు ప్రదర్శించిన ఉత్సాహభరితమైన గర్బా, దాండియా సమూహ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.కార్యక్రమంలో లఖోటియా కాలేజ్ ఆఫ్ డిజైన్ ఛైర్మన్ మిస్టర్ అజహరుద్దీన్ ముజాహిద్, మేనేజింగ్ డైరెక్టర్ మిస్టర్ అఫ్సాన్ ముజాహిద్, శ్రేయాస్ మీడియాకు చెందిన భానుప్రియ ముఖ్యఅతిథులుగా హాజరై, విద్యార్థులు మరియు అధ్యాపకులతో కలిసి పండుగ సంబురాల్లో పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు

ప్రజాపక్షం/అమీర్‌పేట్: బతుకమ్మ సంబురాలు అంబరాన్ని అంటాయి. ఈ మేరకు టిపిసిసి ఉపాధ్యక్షురాలు, ఎఐసిసి సభ్యురాలు, సనత్‌నగర్ నియోజకవర్గం ఇంచార్జి డా.కోట నీలిమ నాయకత్వంలో ఎస్ఆర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవులపల్లి రవి కిరణ్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించడం జరిగింది.

తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆహ్వానం



ప్రజాపక్షం/అమీర్‌పేట్: నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు వివిధ మండపాల నిర్వాహకులు ఆహ్వానం పలికారు. ఈ మేరకు బల్కంపేట్ బిజెఆర్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో నవరాత్రుల సందర్భంగా రేణుక భవాని యూత్ అసోసియేషన్ ప్రతిష్టించిన దుర్గా మాత పూజకి రావలసిందిగా కోరుతూ తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ని ఆహ్వానించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అమీర్‌పేట్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఎం.హనుమంతరావు, నిర్వాహకులు ముత్యాల నాని (లీలా వర్ధన్) మధు, విజయ్, ముత్యాల విష్ణువర్ధన్, భాను, సాయి కిరణ్, దుర్గాప్రసాద్, బస్తీ కమిటీ సభ్యులు, వనం శ్రీనివాస్, కట్ట బలరాం, ముత్యాల సాయి నాథ్, తదితరులు ఉన్నారు.

పరిశ్రమలకు ప్రత్యేక ప్రాధాన్యత

టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: రైతుల పంటల సంరక్షణే లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎస్‌పిడిసిఎల్ అధికారులు 'పొలం బాట పట్టారు. అధికారులు రైతులతో ముఖాముఖి నిర్వహించి విద్యుత్ సమస్యల పరిష్కారం, పొదుపు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా రైతన్నల పంటలను సంరక్షించి, వ్యవసాయానికి నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం, టిజిఎస్‌పిడిసి యాజమాన్యం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలోనే ఎస్‌పిడిసిఎల్ అధికారులు రురల్ సర్కిళ్ళలో వివిధ గ్రామాలు, పట్టణాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వ్యవసాయ విద్యుత్ సరఫరా పరిస్థితులను సమీక్షించారు. యాదాద్రి సర్కిల్లోని నారాయణపూర్ సెక్షన్ పరిధిలో లింగవారిగూడెం, హుస్నాబాద్ టౌన్ సెక్షన్ పరిధిలో హుస్నాబాద్ పట్టణం, మంచాల సెక్షన్ పరిధిలోని చిట్టాపూర్ గ్రామంలో అధికారులు పర్యటించారు. అదేవిధంగా నర్సాపూర్ మండలంలోని చిప్పలతుర్తి, చౌటుప్పల్ సెక్షన్ పరిధిలోని మంగళపల్లి, బెజ్జంకి సెక్షన్ పరిధిలోని వ్యవసాయ పొలాలు, నాంపల్లి, చింతపల్లి ప్రాంతాలతో పాటు సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్ ప్రాంతాల్లో అధికారులు రైతులతో ముఖాముఖి నిర్వహించి విద్యుత్ సరఫరా పరిస్థితులు, అంతరాయాలు, తక్కువ వోల్టేజీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భువనగిరి డివిజన్లోని బీబీనగర్, బొల్లేపల్లి ప్రాంతాల్లో ఆపరేషన్స్ డైరెక్టర్ డా.ఎన్.నరసింహులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులతో మాట్లాడారు.

పరిశ్రమలకు ప్రత్యేక ప్రాధాన్యం

పరిశ్రమల విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్ స్పష్టం చేశారు. ఈ మేరకు రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో శనివారం నిర్వహించిన 6వ స్టేక్ హోల్డర్స్ సమావేశంలో సిఎండి జితేష్ పాటిల్ పాల్గొని పారిశ్రామిక ప్రతినిధులతో వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ, పరిశ్రమల అవసరాలను అర్థం చేసుకుంటూ, వాటికి సంబంధించిన విద్యుత్ సమస్యల పరిష్కారంలో వేగవంతమైన చర్యలు తీసుకోవడానికి ఎస్‌పిడిసిఎల్ కట్టుబడి ఉందని తెలిపారు. పరిశ్రమల ప్రతినిధులు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువస్తే, వాటిని సమీక్షించి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. సమావేశంలో ఎఫ్‌టిసిసి అధ్యక్షుడు కెకె. మహేశ్వరి, ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ అగర్వాల్, ఎనర్జీ కమిటీ చైర్మన్ సుశీల్ కుమార్ సంచేతి, కోచైర్మన్లు కె.శ్రీనివాస్, పి. విజయ గోపాల్ రెడ్డి, ఎఫ్‌టిసిసిఐ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సురేశ్ కుమార్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారు.

'రోస్టర్ పాయింట్లను సవరించాలి'

ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ : ఎస్‌సి గ్రూప్–3లో మాల, 26 అనుబంధ కులాలకు కేటాయించిన రోస్టర్ పాయింట్లను సవరించే వరకు ఎలాంటి విద్య, ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జెఎసి డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జెఎసి చైర్మన్ చెరుకు రాంచందర్ మాట్లాడుతూ మాలల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా మాలల చైతన్య యాత్రను నిర్వహిస్తామన్నారు. అందులోభాగంగా ఎంఆర్ఒలు, జిల్లా కలెక్టర్‌లకు, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, ఎంపిలకు వినతిపత్రాలిస్తామన్నారు. అయినా, ప్రభుత్వ వైఖరిలో మార్పు రానట్లయితే మాలల యుద్ధభేరి మోగిస్తామని, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తామని హెచ్చరించారు.

గల్ఫ్‌పై 'మిట్టపల్లి' బతుకమ్మ పాట ఆవిష్కరణ

ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ : 'ఎడారిలో తంగేడు వనమే మొలిసేనో' అంటూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిమళాన్ని గల్ఫ్ దేశాలకు తీసుకెళ్లే బతుకమ్మ పాట దుబాయ్‌లో ఘనంగా ఆవిష్కృతమైంది. అక్షర గోల్డ్ అండ్ డైమండ్స్ జ్యువెలరీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ కోట కుమార్ (కెకె) ఈ పాటను నిర్మించగా, ప్రముఖ తెలంగాణ ప్రజాకవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్ సాహిత్యాన్ని అందించారు. ప్రముఖ గాయని మంగ్లీ ఆలపించిన ఈ గీతానికి మదీన్ ఎస్కే నేపథ్య సంగీతాన్ని సమకూర్చారు.

ముదిరాజ్‌లను 'బిసి– ఎ'లోకి మార్చాలి

ప్రజాపక్షం/ఖైరతాబాద్: ముదిరాజ్ కులస్తులను బిసి డి కేటగిరి నుంచి బిసి ఎ లోకి మార్చడంతో పాటు, రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని తెలంగాణ ముదిరాజ్ ఆత్మగౌరవ పోరాట సంఘం రాష్ట్ర కన్వీనర్ పిట్టల భూమేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరు జగన్మోహన్ ముదిరాజ్, బిసి ఎఫ్ నాయకులు నాగులమణి చంద్రమోహన్ ముదిరాజ్, చెన్న రాములు, చింతల నీలకంఠం తదితరులతో కలిసి మాట్లాడారు. ముదిరాజ్‌ల ఆత్మగౌరవం, హక్కుల సాధనే లక్ష్యంగా తెలంగాణ ముదిరాజ్ ఆత్మగౌరవ పోరాట సంఘం (టిమ్యాప్స్) ఆవిర్భవించిందన్నారు. మత్స్యకార కార్పొరేషన్‌కు రూ.200 కోట్లు కేటాయించాలని, 55 ఏళ్లు దాటిన ముదిరాజులు, మత్స్యకారులకు పింఛన్లు అందించాలని కోరారు. సమావేశంలో నిజామాబాద్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నారాయణ ముదిరాజ్, శ్రీహరి ముదిరాజ్, కామారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు శ్రీనివాస్ ముదిరాజ్, మొగులయ్య ముదిరాజ్, నగర ముదిరాజ్ సంఘం నాయకులు సురేష్ ముదిరాజ్, భూలక్ష్మి ముదిరాజ్, పావని ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి అవకాశం..

ఎండి అశోక్‌రెడ్డి దృష్టి సారిస్తారా?

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: ఏకంగా రూ.కోటికి పైగా అవినీతి వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ జెటోర్సింగ్ ఉద్యోగిని తిరిగి విధుల్లోకి తీసుకోవడం జలమండలిలో తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. నాలుగేళ్ల క్రితం అప్పటి చందానగర్ సర్కిల్‌లో చోటుచేసుకున్న అవినీతి వ్యవహారంలో అక్కడ విధులు నిర్వహించిన డిజిఎం, జిఎం, క్షేత్రస్థాయి ఉద్యోగులపై ఆరోపణలు వచ్చిన విషయం విధితమే. అయితే జెటోర్సింగ్ లైన్‌మెన్‌ను పరారీ చేయించి కేసులు నమోదుకాకుండా జాగ్రత్త వహించారని విమర్శలున్నాయి. అనూహ్యంగా నెలరోజుల క్రితం అదే జెటోర్సింగ్ ఉద్యోగి విప్రో సర్కిల్ వద్ద ఉన్న జలమండలి కార్యాలయంలో చేరడంతో జలమండలిలో అవినీతిపై చర్చజరుగుతోంది. వెస్ట్‌జోన్ పరిధిలోని నివాసిత కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, బస్తీలు, ఐటీ పార్కులు, కమర్షియల్ కాంప్లెక్సులతో సహా అన్ని ప్రాంతాల్లో నీటి కొరత ఉంటుంది. ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్, సైబర్ సిటీ, నాలెడ్జ్ సిటి, వివిధ ఐటీ పార్కులు, కమర్షియల్ కాంప్లెక్సులు ఇక్కడే ఉండటంతో అక్కడ జలమండలిలో విధులు నిర్వహిస్తున్న వారు బదిలీపై వెళ్లేందుకు ఇష్టపడరు. అందుకే ఎన్ని ఆరోపణలు వచ్చినా వాటిని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తుంటా రు. ఏదేమైనా జలమండలి ఎండి అశోక్‌రెడ్డి ఈ వ్యవహారంపై ఎటువంటి నిర్ణయం తీసుకుంటారు? అనేది వేచిచూడాల్సిందే.

గుజ్జ సత్యంకు ఎమ్మెల్సీ ఇవ్వాలి

ప్రజాపక్షం/ఖైరతాబాద్: బిసి ఉద్యమ నాయకుడు, చేనేత కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యంకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని సోమాజిగూడలో నిర్వహించిన బిసి జెఎసి రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సందర్భంగా బిసి సంక్షేమ శాఖ సలహాదారు విహెచ్ హనుమంతరావు, రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకుడు వీజీఆర్ నారగోని, కటకం నర్సింగ్‌రావు, కర్నాటి ధనంజయ, మట్ట జయంతి గౌడ్, రఘురాం, రాములు యాదవ్, సూర్యనారాయణ, పండరి నాథ్ తదితరులు మాట్లాడుతూ.. బిసిల హక్కుల సాధన, చేనేత కార్మికుల సంక్షేమం, విద్యార్థుల సమస్యల పరిష్కారం, కార్మికుల హక్కుల కోసం గుజ్జ సత్యం చేస్తున్న కృషిని గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు, ప్రత్యేక సంక్షేమ నిధుల సాధన వంటి అంశాలపై ఆయన నిరంతరం పోరాడుతున్నారని అన్నారు. రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రభుత్వం పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

మెట్రోభవన్‌లో సంబురాలు

ప్రజాపక్షం/బేగంపేట: మెట్రో రైల్ భవన్‌లో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మెట్రో రైల్ సంస్థలో పని చేస్తున్న మహిళా సిబ్బంది బతుకమ్మను అలంకరించి, పూజలు చేశారు. వేడుకలలో హెచ్‌ఎంఆర్ఎల్ ఉద్యోగులు పాల్గొని, తెలంగాణ వైభవాన్ని చాటారు. ఎంగిలి పూల బతుకమ్మతో మొదలై సద్దుల బతుకమ్మ వరకు తెలంగాణ అంతా విస్తృతంగా జరుగుతున్న సంబురాలలో భాగంగా హెచ్‌ఎంఆర్ఎల్ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మలకం చెరువు వర్కర్లు.. సెక్యూరిటీ సిబ్బందికి 'దసరా' కానుకలు

ప్రజాపక్షం /హైదరాబాద్ : మలకం చెరువు పార్కులో నిరంతరం సేవలు అందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, గార్డెనింగ్ వర్కర్లు, సెక్యూరిటీ సిబ్బందికి మలకం చెరువు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు బతుకమ్మ, దసరా పండుగ కానుకలు అందజేశారు. చెరువు ప్రాంగణాన్ని పరిశుభ్రంగా, భద్రంగా ఉంచడంలో శ్రమిస్తున్న వర్కర్ల సేవలను గుర్తించి వాకర్స్ అసోసియేషన్ ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. అసోసియేషన్ సభ్యులు తమ స్వచ్ఛంద విరాళాలతో సేకరించిన రూ.20 వేలు నగదును వర్కర్లు, సెక్యూరిటీ సిబ్బందికి పండుగ కానుకలుగా అందజేశారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ నాయకుడు మల్లికార్జున్, ప్రభాకర్ బాబు, సతీష్ గౌడ్, శ్రీనివాస్‌రావు, సాంబశివరావు, హరినాథ్ బాబ్జి, రమణారెడ్డి వారిని ఉద్దేశించి మాట్లాడుతూ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

మ్యూజియం ఉద్యోగుల వినతిపత్రం

ప్రజాపక్షం/మదీన: సాలార్‌జంగ్ మ్యూజియంలో దీర్ఘకాలంగా డైలీ వేజెస్ ప్రాతిపదికన పనిచేస్తున్న 53 మంది ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో ఆల్ ఇండియా ఎస్‌సి, ఎస్‌టి హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో మ్యూజియం డైరెక్టర్ ప్రియాంక మేరీ ఫ్రాన్సిస్‌ను సంఘం ఇంచార్జి ప్రెసిడెంట్ ఎర్మాల శివరాజ్, ప్రధాన కార్యదర్శి రసూరి చంద్రశేఖర్ కలిసి సమస్యలను వివరించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలంగా డైలీ వేజెస్ ప్రాతిపదికన పనిచేస్తున్న 53 మంది ఉద్యోగులకు న్యాయమైన వేతనాలు కల్పించడం, వారి సేవలకు తగిన గుర్తింపు ఇవ్వడం, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలను డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.ఈ వినతిపై డైరెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, డైలీ వేజెస్ ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న న్యాయమూర్తులు

ప్రజాపక్షం/లాల్‌దర్వాజా: సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న దసరా నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా హైదరాబాద్ నగరంలోని వివిధ న్యాయస్థానాలకు చెందిన న్యాయమూర్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు సిటీ సివిల్ కోర్టు న్యాయమూర్తులు కల్పన, శాశ్వత, మౌనిక, నాంపల్లి క్రిమినల్ కోర్టు న్యాయమూర్తి శ్రీవాణి అమ్మవారిని సందర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ జి.అరవింద్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఎస్.దశరథలాల్, జె.రాజేష్, జి.హరీష్, భరత్ కుమార్ గౌరవ న్యాయమూర్తులకు స్వాగతం పలికారు.అనంతరం గౌరవ న్యాయమూర్తులకు ఆలయ కమిటీ తరపున శాలువాలతో సన్మానించి అమ్మవారి ప్రసాదాన్ని అందించారు.

వీరనారి ఐలమ్మ వర్సిటీ.. విసి సూర్యా ధనుంజయ్‌కి అవార్డు

ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్: వీరనారి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సూర్యా ధనుంజయ్ ప్రతిష్టాత్మక సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయ స్థాయి సాహిత్య పురస్కారం 2025 (కథా విభాగం) దక్కింది. సమాజంలోని అట్టడుగు వర్గాల జీవన వ్యథలను, మానవ సంబంధాల లోతులను కళ్లకు కడుతూ ఆమె కలం నుంచి జాలువారిన సంచలన కథా సంపుటి 'ఝోలీ'కి అత్యున్నత గౌరవం పొందారు. అకడమిక్ బాధ్యతల్లో తలమునకలవుతూనే, సమాజ హృదయాన్ని స్పృశించే సాహిత్య సృష్టి చేయగల సత్తా ఆమె సొంతం. తెలుగు కథా జగత్తులో తనదైన సృజనాత్మక శైలితో పాఠకుల మనసులను హత్తుకున్న 'ఝోలీ' కథలకు ఈ గుర్తింపు దక్కడం తెలంగాణ సాహిత్య రంగంలో సరికొత్త చర్చకు దారితీసింది. వర్సిటీ ఉన్నత పీఠంపై ఉంటూనే ఇంతటి భావోద్వేగపూరితమైన రచనను అందించడం ద్వారా యువ రచయితలకు, పరిశోధక విద్యార్థులకు ఆమె సరికొత్త రోల్ మోడల్‌గా నిలిచారు.

ప్రజా సమస్యలపై పాలకులు దృష్టి సారించాలి

మాజీ కార్పొరేటర్ మహేష్ కుమార్ యాదవ్

ప్రజాపక్షం/ఖైరతాబాద్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు నిరంతరం అందుబాటులో ఉండాలని మాజీ కార్పొరేటర్ మహేష్ కుమార్ యాదవ్ అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. శనివారం సోమాజిగూడలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాలని అన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు స్పందించడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు.ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు ఎప్పుడు జరిగినా బి.ఆర్.ఎస్ పార్టీ విజయం సాధించడం కాయం అని ధీమా వ్యక్తం చేశారు.

తిరంగా ర్యాలీ

ప్రజాపక్షం/చార్మినార్: తెలంగాణ బిసి సంక్షేమం, అభివృద్ధి శాఖ సలహాదారు వి.హనుమంతరావు నాయకత్వంలో మదీనా ఎక్స్ రోడ్ నుంచి చార్మినార్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. మోదీ ప్రభుత్వానికి, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి విహెచ్ ర్యాలీ నిర్వహించారు.ర్యాలీలో హైదరాబాద్ డిసిసి అధ్యక్షుడు సయ్యద్ ఖలీద్ సైఫుల్లా, ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షుడు మోతె రోహిత్, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముజీబుల్లా షరీఫ్, మాజీ ఇంచార్జి కె.వెంకటేష్, బహదూర్‌పురా ఇంచార్జి పి.రాజేష్ కుమార్, చాంద్రాయణగుట్ట ఇంచార్జి బోయ నాగేష్, మొహమ్మద్ ఐజాజ్, సయ్యద్ దిలావర్ హుస్సేన్, అస్లాం షరీఫ్, అఫూ రజా తబాతబాయి, ముజమ్మిల్ ఖాద్రీ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాణాప్రతాప్‌నగర్‌లో దేవీ నవరాత్రి ఉత్సవాలు

ప్రజాపక్షం / కూకట్‌పల్లి : అల్లాపూర్ డివిజన్‌లోని రాణాప్రతాప్ నగర్‌లో శనివారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో జనసేన పార్టీ రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా రాణాప్రతాప్ నగర్‌కు చేరుకున్న ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌కు ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సత్కరించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు కొల్లా శంకర్, ప్రసాద్ నాయుడు, వెంకట్, రామ్ గౌడ్, కిషోర్, కిరణ్, సాయి, పృథ్వీ, రోహిత్, కన్నా, రాహుల్, సందీప్, మోహన్, వంశీ పాల్గొన్నారు.

ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

ప్రజాపక్షం/అమీర్‌పేట్: అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. శనివారం అమీర్‌పేట్ డివిజన్‌లోని లీలానగర్‌లో రూ.6 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఎన్నికల సంఘం ఓటరు నమోదు కార్యక్రమం

భారత సేల్స్‌మెన్ మోదీకి బుద్ధి చెప్పాలి : వి.ఎస్.బోస్

ప్రజాపక్షం/హైదరాబాద్: మోదీ పాలనలో అక్రమంగా, అన్యాయంగా విదేశీ పెట్టుబడులను స్వదేశీ సంస్థల్లోకి అనుమతించడం ముమ్మాటికీ దేశ ద్రోహపూరిత చర్య అని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ అన్నారు. పరిశ్రమల అభివృద్ధి కోసం గత కేంద్ర ప్రభుత్వం ఐడిబిఐ బ్యాంకును ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. స్థాపిత లక్ష్యాలకు భిన్నంగా ఐడిబిఐ బ్యాంకులోకి విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం వెనుక భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే కుట్ర దాగి ఉందని విమర్శించారు. దేశాభివృద్ధిపై తప్పుడు లెక్కలు ప్రచారం చేసి ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వానికి ఇలాంటి చర్యలు సాధారణంగా అనిపిస్తున్నాయని అన్నారు. దేశం కోసమే తాను ఉన్నానని నిత్యం గొప్పలు చెప్పుకుంటూ విదేశాలకు ఊడిగం చేసే మోదీకి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. గత మూడేళ్లలో సుమారు రూ.24 వేల కోట్ల లాభాలు ఆర్జించిన ఐడిబిఐ బ్యాంకులోని 60 శాతం వాటాలను ఫెయిర్ ఫ్యాక్స్ అనే విదేశీ సంస్థకు విక్రయించాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో దేశ బ్యాంకింగ్ వ్యవస్థకు తీవ్రమైన ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న ఎల్‌నినో ప్రభావంతో రాబోయే ప్రమాదాలపై దృష్టి సారించకుండా, లాభాల్లో నడుస్తున్న ఐడిబిఐ బ్యాంకు వాటాలను విక్రయించడం ఎవరి ప్రయోజనాల కోసమో మోదీ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు నిరసనలు తెలియజేయడం హర్షణీయమని పేర్కొంటూ వారిని అభినందించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు హాని కలిగించే విదేశీ పెట్టుబడుల నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవడానికి బ్యాంకు ఉద్యోగులతో పాటు ప్రజలు కూడా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ
సంబరాలకు సర్వం సిద్ధం

700 మంది కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శనలు.. కనువిందు చేయనున్న లేజర్
సినీ తారలు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న రాక

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, పూల పండుగ వైభవానికి ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ సంబరాలకు హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ ముస్తాబైంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పేలా రాష్ట్ర ప్రభుత్వం వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. 700 మంది కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు, కనువిందు చేసే లేజర్ షోతో ట్యాంక్‌బండ్ పండుగ శోభను సంతరించుకోనుంది. సినీ తారలు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న సైతం వేడుకలకు హాజరుకానుండటంతో సంబరాలపై మరింత ఆసక్తి నెలకొంది. సద్దుల బతుకమ్మ వేడుకల నిర్వహణకు సంబంధించి పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ అధికారులతో మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష నిర్వహించారు. వేడుకల్లో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.తెలంగాణ కళలు, జానపద సంప్రదాయాల ఔన్నత్యాన్ని ప్రతిబింబించేలా 700 మంది కళాకారులతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర గొప్పతనాన్ని చాటిచెప్పే జానపద కళారూపాలు, సంప్రదాయ ప్రదర్శనలు వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. వీటికి తోడు ప్రత్యేకంగా నిర్వహించే లేజర్ షో ప్రేక్షకులను అలరించనుంది. సద్దుల బతుకమ్మ వేడుకలకు సినీ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న హాజరుకానుండటంతో సంబరాలకు ప్రత్యేక ఆకర్షణ చేకూరనుంది. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ట్యాంక్‌బండ్‌పై వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, మహిళల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను కనులపండువగా నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు ముమ్మరం చేశారు.

తెలంగాణ ఆడపడుచులందరికీ మంత్రి పొన్నం సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని రాష్ట్రం లోని ఆడపడుచులందరికీ రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకునే బతుకమ్మ పండుగ మన రాష్ట్ర అస్తిత్వానికి, పూల పండుగ ప్రత్యేకతకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ 9 రోజుల పాటు పూలతో పూజించి బతుకమ్మ ఆట పాటలతో మహిళలు ఐకమత్యంతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రపంచానికి చాటిచెబుతుందని తెలిపారు. ఈ సద్దుల బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాలు నింపాలని, తెలంగాణ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సిరిసంపదలు కలగాలని ఆకాంక్షించారు. మహిళలు, యువతులు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా పండుగను జరుపుకోవాలని కోరారు. తెలంగాణ సంప్రదాయాలను, సంస్కృతిని భావితరాలకు అందించేలా బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు

పూలను దైవంగా భావించి పూజించే ఏకైక సంస్కృతి తెలంగాణ సొంతమని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవానికి,సంస్కృతి వైభవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పండుగ మన అస్తిత్వానికి, మన తెలంగాణ జీవనశైలికి నిలువుటద్దం లాంటిదని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో పండుగలు ఉన్నప్పటికీ, రంగురంగుల పూలను పేర్చి, గౌరమ్మను కొలిచే ఈ అద్భుతమైన వేడుక మన నేల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటితోందన్నారు. పూలను బతుకమ్మ రూపంలో పూజించడం ద్వారా మన పూర్వీకులు ప్రకృతితో మమేకమైన జీవన విధానాన్ని మనకు అందించారని,ఈ సాంప్రదాయాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టఐశ్వర్యాలతో వర్ధిల్లుతూ అంగరంగవైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

రాష్ట్ర పండుగ బతుకమ్మ ముగింపు వేడుకలు సద్దుల బతుకమ్మ సందర్భంగా, తెలంగాణ ఆడబిడ్డలకు బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు శుభాకాంక్షలు తెలిపారు.తొమ్మిదిరోజుల పాటు ఆడబిడ్డల ఆటపాటలతో సాగిన బతుకమ్మ సంబురాలతో తెలంగాణ వ్యాప్తంగా సందడి నెలకొన్నదన్నారు. 'మల్లా రావమ్మా బతుకమ్మా.. మా బతుకులు బాగు చేయవమ్మా'అని కోరుకుంటూ బతుకమ్మకు వీడ్కోలు పలుకుతూ ఘనమైన తెలంగాణ సాంస్కృతిక వేడుకలను ఆడబిడ్డలు ముగిస్తారని కెసిఆర్ వివరించారు. రాష్ట్ర సాధనలో, తెలంగాణ ప్రగతిలో మహిళల భాగస్వామ్యం మహోన్నతమైనదన్నారు. ఆడబిడ్డలకు ఎటువంటి కష్టం కలగకుండా చూస్తూ, వారి సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేయడం ద్వారానే బతుకమ్మ పండుగ స్ఫూర్తిని కొనసాగించిన వారమౌతామని కెసిఆర్ తెలిపారు.

సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గాల అన్వేషణే లక్ష్యం
డాక్టర్ గడల శ్రీనివాసరావు

ప్రజాపక్షం/హైదరాబాద్: డిగ్రీలు, పిజిలు పూర్తిచేసి ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు భరోసా కల్పించడంతో పాటు, విద్యార్థులు, నిరుద్యోగులు, పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కార మార్గాలను అన్వేషించడమే జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్ ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆరట్స్ కళాశాల ప్రాంగణం నుంచి గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్ యాత్రను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా విద్యార్థులు చేసిన పోరాటాలు, త్యాగాలు చిరస్మరణీయమని, అలాంటి చారిత్రక ప్రాంగణం నుంచి యువత భవిష్యత్తు కోసం యాత్ర ప్రారంభించడం గర్వకారణమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు అప్పులు చేసి పిల్లలను చదివిస్తున్నా, పట్టభద్రులకు ఆశించిన స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల అమలుపై సమగ్ర సమీక్ష చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేటు రంగంలో ఉపాధి, స్వయం ఉపాధి, అంకుర సంస్థలకు అవకాశాలు విస్తరించాలని సూచించారు. యువత విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగాలతో అనుసంధానించే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ మార్గదర్శకత్వంలో చేపట్టిన ఈ యాత్ర కేవలం ఎన్నికల ప్రచారానికి పరిమితం కాదని, యువత సమస్యలను తెలుసుకునే ప్రజాసేవా వేదికగా కొనసాగుతుందని తెలిపారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ ప్రాంతాల్లో విద్యార్థులు, నిరుద్యోగులు, పట్టభద్రులను కలిసి వారి సమస్యలు, సూచనలు సేకరించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరుతూ, ఇన్నాళ్లూ నాయకులు మాట్లాడారు.. యువత విన్నారు. ఇక యువత మాట్లాడాలి.. నాయకత్వం వినాలి అని పిలుపునిచ్చారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం : రాంచందర్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ పట్టభద్రుల నియోజకవర్గంలో అభ్యర్థి ఎవరైనా సరే బిజెపి విజయమే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పిలుపునిచ్చారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన అధ్యక్షతన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గౌతం రావు, శాసనమండలి సభ్యులు ఏవిఎన్ రెడ్డి, మల్క కొమురయ్య, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్, రెండు ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు చెందిన పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ గతంలో హైదరాబాద్ పట్టభద్రుల స్థానాన్ని దివంగత నేత వి. రామారావు పలు మార్లు గెలుచుకున్నారని, ఇతర నియోజకవర్గాల్లోనూ బిజెపి అభ్యర్థులు ఘన విజయం సాధించిన చరిత్ర ఉందన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల వైఫల్యాలను ఎండగడుతూ క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడితో పాటు వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను ఓటర్లుగా నమోదు చేయించే బాధ్యతను పార్టీ శ్రేణులు తీసుకోవాలని సూచించారు.

జర్నలిస్టుల నివాస స్థలాల సమస్య పరిష్కరించాలి
సిఎం రేవంత్‌రెడ్డిని కోరిన మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/ ఖమ్మం : రాష్ట్రంలో జర్నలిస్టుల నివాస స్థలాల సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఖమ్మం నియోజకవర్గ జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను త్వరగా పరిష్కరించి అర్హులకు స్థలాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన మంత్రి తుమ్మల ఉమ్మడి జిల్లాతో పాటు ఖమ్మం నియోజక వర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఎల్‌నినో కారణంగా ఏర్పడిన పరిస్థితులను అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైతుల భూమిని కాపాడడంతో పాటు సాగునీటి ప్రాజెక్టుల వ్యయాన్ని తగ్గించేందుకు పైపులతో నీరు అందించేందుకు పనులు ప్రారంభించాలని ఆయన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటిని నిల్వ చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను ఆయన వివరించారు. జిల్లాకు సంబంధించి అభివృద్ధి కార్యక్రమాల నివేదికతో పాటు ఖమ్మం నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాల జాబితాను అందజేశారు.

సైబర్ నేరాలు, డ్రగ్స్ అక్రమ రవాణాపై
యువ ఐపిఎస్‌లు ప్రత్యేక దృష్టి సారించాలి

సంప్రదాయ భద్రతా సవాళ్లు తగ్గుతున్నా ఫోరెన్సిక్ ఆధారిత దర్యాప్తుతోనే నేరాల కట్టడి
78వ బ్యాచ్ ఐపిఎస్ ప్రొబేషనర్లకు కేంద్ర హోంమంత్రి సందేశం

ప్రజాపక్షం/హైదరాబాద్: దేశంలో సంప్రదాయ భద్రతా సవాళ్లు తగ్గుముఖం పడుతున్నప్పటికీ సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఉగ్రవాదం, అక్రమ విదేశీయుల సమస్య, సాంకేతికతను ఉపయోగించి నేరాలను దాచిపెట్టడం వంటి కొత్త సవాళ్లపై యువ ఐపిఎస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సందేశం పిలుపునిచ్చింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఫోరెన్సిక్ శాస్త్రం, సమర్థవంతమైన దర్యాప్తు పద్ధతులను మానవీయ దృక్పథంతో మేళవించి ప్రజల విశ్వాసాన్ని చూరగొనే పోలీసు వ్యవస్థ నిర్మాణానికి కృషి చేయాలని సూచించింది. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో 78వ రెగ్యులర్ రిక్రూట్ (2025 బ్యాచ్) ఐపిఎస్ ప్రొబేషనర్ల దీక్షాంత్ పరేడ్ సందర్భంగా అమీత్‌షా పంపిన సందేశాన్ని కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ఈ సందర్భంగా చదివి వినిపించారు. పోలీసు అధికారుల గుర్తింపు వారి హోదా, ప్రచారంతో కాకుండా నిష్పక్షపాత వైఖరి, విధి నిర్వహణలో నిబద్ధత, ప్రజల పట్ల బాధ్యతతో ఏర్పడుతుందని సందేశంలో పేర్కొన్నారు. అధికారంతో పాటు బాధ్యత, శక్తితో పాటు సున్నితత్వం కూడా పోలీసు అధికారులకు ముఖ్యమని స్పష్టం చేశారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినియం నూతన నేర న్యాయ వ్యవస్థకు దిశానిర్దేశం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ చట్టాల స్ఫూర్తిని క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో యువ పోలీసు అధికారుల పాత్ర కీలకమని తెలిపారు. ఉగ్రవాదంపై ఏమాత్రం ఉపేక్ష లేకుండా చర్యలు తీసుకోవడం, నిఘా వ్యవస్థల మధ్య సమన్వయం పెంచడం, సరిహద్దుల భద్రతను ఆధునిక సాంకేతికతతో బలోపేతం చేయడం అవసరమని సూచించారు. డ్రగ్స్ అక్రమ రవాణా నెట్‌వర్క్‌లపై కఠిన చర్యలతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ప్రసంగించిన కేంద్ర హోంమంత్రి సందేశంలోని అంశాలు, భద్రతా పరిస్థితులపై దృష్టి సారిస్తూ దేశం గత ఐదు దశాబ్దాలుగా ఎదుర్కొన్న వామపక్ష తీవ్రవాదం, ఈశాన్య రాష్ట్రాల్లో తిరుగుబాట్లు, స్వదేశీ, విదేశీ ప్రేరేపిత ఉగ్రవాదం వంటి సంప్రదాయ సవాళ్లలో మార్పులు చోటుచేసుకున్నాయని వివరించారు. అనేక ప్రాంతాల్లో హింస తగ్గుముఖం పట్టిందని, ఒప్పందాల ద్వారా పలువురు తిరుగుబాటుదారులు శాంతియుత జీవనంలోకి తిరిగి వచ్చారని పేర్కొన్నారు.అయితే, సంప్రదాయ సమస్యలు తగ్గినంత మాత్రాన భద్రతా సవాళ్లు పూర్తిగా తొలగిపోలేదని, వాటి స్వరూపం మారుతోందని హెచ్చరించారు. మాదకద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలు, స్వదేశీ ఉగ్రవాదం, అక్రమంగా దేశంలోకి ప్రవేశించే విదేశీయుల సమస్య, సాంకేతికత ద్వారా నేరాలను గుర్తించడం కష్టతరం చేసే పరిస్థితులు ప్రధాన సవాళ్లుగా మారుతున్నాయని తెలిపారు. 2019 సర్వేను ప్రస్తావిస్తూ దేశ జనాభాలో సుమారు ఏడు శాతం మంది ఏదో ఒక రూపంలో మాదకద్రవ్యాలను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు.
తక్కువ సాంకేతిక నైపుణ్యాలతోనూ సైబర్ నేరాలకు పాల్పడే పరిస్థితులు పెరుగుతున్నందున పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణలో సాంకేతికతను సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు రాజ్యాంగ విలువలు, నిజాయితీ, సంయమనం, ప్రజాసేవ పట్ల నిబద్ధతను ప్రాథమిక సూత్రాలుగా పాటించాలని యువ ఐపిఎస్ అధికారులకు సందేశం ఇచ్చారు. ప్రజల్లో భద్రతపై నమ్మకాన్ని పెంపొందిస్తూ దేశ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

తెలంగాణ వైభవానికి బతుకమ్మ చిరస్మరణీయ ప్రతీక
ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) ప్రధాన కార్యాలయంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలతో కార్యాలయ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ వేడుకల్లో ఎంఎంసి అధికారులు, వివిధ విభాగాల సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్న మహిళలు పూల బతుకమ్మల చుట్టూ ఆడి పాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటారు. కార్యాలయ ప్రాంగణమంతా బతుకమ్మ పాటలు, సంబరాలతో సందడిగా మారింది. ఈ సందర్భంగా ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ వైభవానికి బతుకమ్మ చిరస్మరణీయ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల సాంస్కృతిక వైభవానికి, ప్రకృతితో ముడిపడిన సంప్రదాయాలకు, సామూహిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ విశిష్టమైన పండుగ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ప్రభుత్వ సేవలందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు ఇలాంటి సాంస్కృతిక వేడుకల్లో కలిసికట్టుగా పాల్గొనడం ద్వారా పరస్పర సౌభ్రాతృత్వం, ఐక్యత మరింత బలోపేతం అవుతుందని అన్నారు. మన సంస్కృతి, మన సంప్రదాయం, మన గర్వం అనే భావనకు బతుకమ్మ పండుగ నిలువెత్తు నిదర్శనమన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం : రాంచందర్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ పట్టభద్రుల నియోజకవర్గంలో అభ్యర్థి ఎవరైనా సరే బిజెపి విజయమే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పిలుపునిచ్చారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన అధ్యక్షతన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గౌతం రావు, శాసనమండలి సభ్యులు ఏవిఎన్ రెడ్డి, మల్క కొమురయ్య, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్, రెండు ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు చెందిన పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ గతంలో హైదరాబాద్ పట్టభద్రుల స్థానాన్ని దివంగత నేత వి. రామారావు పలు మార్లు గెలుచుకున్నారని, ఇతర నియోజకవర్గాల్లోనూ బిజెపి అభ్యర్థులు ఘన విజయం సాధించిన చరిత్ర ఉందన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల వైఫల్యాలను ఎండగడుతూ క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడితో పాటు వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను ఓటర్లుగా నమోదు చేయించే బాధ్యతను పార్టీ శ్రేణులు తీసుకోవాలని సూచించారు.

జర్నలిస్టుల నివాస స్థలాల సమస్య పరిష్కరించాలి
సిఎం రేవంత్‌రెడ్డిని కోరిన మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/ ఖమ్మం : రాష్ట్రంలో జర్నలిస్టుల నివాస స్థలాల సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఖమ్మం నియోజకవర్గ జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను త్వరగా పరిష్కరించి అర్హులకు స్థలాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన మంత్రి తుమ్మల ఉమ్మడి జిల్లాతో పాటు ఖమ్మం నియోజక వర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఎల్‌నినో కారణంగా ఏర్పడిన పరిస్థితులను అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైతుల భూమిని కాపాడడంతో పాటు సాగునీటి ప్రాజెక్టుల వ్యయాన్ని తగ్గించేందుకు పైపులతో నీరు అందించేందుకు పనులు ప్రారంభించాలని ఆయన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటిని నిల్వ చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను ఆయన వివరించారు. జిల్లాకు సంబంధించి అభివృద్ధి కార్యక్రమాల నివేదికతో పాటు ఖమ్మం నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాల జాబితాను అందజేశారు.

ఇంజినీరింగ్ కళాశాల దాండియా వేడుకల్లో విషాదం..

విద్యార్థిని మృతి

హైదరాబాద్ : దసరా పండగ వేళ విద్యార్థులు ఉత్సాహంగా దాండియా ఆడుతుండగా జరిగిన ప్రమాదం తీవ్ర విషాదం నింపింది. రంగారెడ్డి జిల్లా నాదర్గుల్లోని ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో దాండియా ఈవెంట్‌లో అపశ్రుతి చోటుచేసుకుంది. కాలేజీ యాజమాన్యం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులంతా కలిసి దాండియా నృత్యం చేస్తుండగా.. లైటింగ్ సిస్టమ్ ఒక్కసారిగా కూలిపోయి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఓ విద్యార్థిని మృతి చెందగా.. పలువురు విద్యార్థులు గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సాయంత్రం కాలేజీ సమీపంలో గాలివాన రావడంతో లైటింగ్ సిస్టమ్ ఒక్కసారిగా కింద పడటంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో దాదాపు 25 మంది విద్యార్థులు గాయపడగా.. అక్కడే ఉన్న మిగతా విద్యార్థులు, సిబ్బంది హుటాహుటిన వారిని సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మరోవైపు, ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని ప్రాథమిక వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటన ఎలా జరిగిందనే వివరాలను ఆరా తీస్తున్నట్లు సమాచారం. పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది. దాండియా వేడుకల్లో ప్రమాదాన్ని నిరసిస్తూ విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. నిరసన వ్యక్తం చేస్తూ కళాశాల ఆవరణలోకి దూసుకెళ్లిన విద్యార్థి సంఘాల నాయకులు ఫర్నీచర్ను ధ్వంసం చేశారు.